ఆదివారం
08-01-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 197
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

నేటి నుంచి గీతా ముఖర్జీ శతజయంత్యుత్సవం

కమ్యూనిస్టు విప్లవయోధ గీతా ముఖర్జీ శతజయంత్యువాన్ని నేటి నుంచి దేశవ్యాప్తంగా సీపీఐ పిలుపు మేరకు ఘనంగా నిర్వహించనున్నారు.

కార్మిక హక్కులపై ఉక్కుపాదం

- కార్పొరేట్లకు మోదీ సర్కార్ ఊడిగం
- అమర్‌జిత్ కౌర్ విమర్శ

విశాలాంధ్ర–హైదరాబాద్: రాజ్యాంగం కల్పించిన కార్మిక హక్కులపై మోదీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్‌కౌర్ విమర్శించారు. పోరాడి సాధించుకున్న చట్టాలను పథకం ప్రకారం ధ్వంసం చేస్తోందని, ప్రత్యేకించి కార్పొరేట్ పెద్దలకు కేంద్ర ప్రభుత్వం ఊడిగం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగ రక్షణ, కార్మిక చట్టాల పరిరక్షణ కోసం శ్రామికవర్గం సమరశీల పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో 'రాజ్యాంగం, కార్మిక చట్టాల రక్షణ కోసం మిలిటెంట్ పోరాటాల ఆవశ్యకత' అంశంపై శనివారం సదస్సు జరిగింది. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యండీ యూసుఫ్ అధ్యక్షత వహించగా ప్రధాన

- మిగతా 2 లో

ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఉద్యమించాలి

'ఉత్తరాంధ్ర ప్రజలు ఏం కోరుకుంటున్నారు...' సదస్సులో వక్తలు

విశాలాంధ్ర–విశాఖ: ఉత్తరాంధ్ర అభివృద్ధికి పార్టీలకు అతీతంగా అందరూ ఉద్యమించాలని ఉత్తరాంధ్ర చర్చా వేదిక అధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'ఉత్తరాంధ్ర ప్రజలు ఏం కోరుకుంటున్నారు...' సదస్సులో వక్తలు పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర చర్చా వేదిక కన్వీనర్, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం ఒక కార్యాచరణ రూపొందించాలని అనేక మంది నాయకులు తెలిపారు. లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ వ్యవస్థీకృత లోపం, పాలకుల పాపం వల్లే ఉత్తరాంధ్ర వెనుకబడిందన్నారు. సారవంతమైన నేల, తగిన వర్షపాతం, తీర ప్రాంతం ఉన్నా ఉత్తరాంధ్ర వెనుకబడి ఉండడానికి తగిన ప్రణాళిక లేకపోవడం కారణమన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ అభివృద్ధికి ప్రాంతీయ బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. అధికార వికేంద్రీకరణ చేసి జిల్లా ప్రభుత్వాలను ఏర్పాటు చేయాలని, చిన్న పట్టణాలను పెంచాలని అన్నారు. అభివృద్ధిలో వ్యవసాయ రంగం వాటా 17 నుంచి 20 శాతం మాత్రమేనని, మిగతా వాటా ఉత్పత్తి రంగానిదని అన్నారు. దురదృష్టవశాత్తు మహానగరాలపై మాత్రమే పాలకులు దృష్టి పెడుతున్నారేగానీ, చిన్న పట్టణాలపై దృష్టి లేదని అన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి రావాలని అన్నారు. గోదావరి–మహానది అనుసంధానం జరగాలన్నారు. ప్రజా జీవితంలో మహిళలకు భాగస్వామ్యం పెంచాలని అన్నారు. కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రజా ఉద్యమం రావాలని అభిప్రాయపడ్డారు. గంగవరం పోర్టును ప్రైవేటుకు కట్టబెట్టారని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ దారుణమని అన్నారు. గతంలో చేసిన అరకు డిక్లరేషన్‌ని పూర్తిగా అమలు చేయాలన్నారు. తీర ప్రాంతాల్లో పరిశ్రమల నుంచి కాలుష్యాన్ని నియంత్రించాలన్నారు. పరిశ్రమల వల్ల సముద్ర జలాలు కలుషితమై, మత్స్య సంపద నాశనమై మత్స్యకారులు నష్టపోతున్నారని, అందువల్ల తీర ప్రాంత పరిశ్రమలకు మత్స్యకారుల నుంచి

- మిగతా 2 లో

తామర తుపాను

మిర్చి పంటను నాశనం చేస్తున్న చీడ పురుగు

- పంట రక్షణకు రైతన్న అవస్థలు వర్ణనాతీతం
- రోజుకోరకం పురుగుమందు కొడుతూ అప్పులపాలు
- విపత్తుగా ప్రకటించి ఎకరానికి లక్ష ఇవ్వాలని రైతు నేతల డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: అత్యధిక పెట్టుబడితో కూడిన మిర్చి పంటను ఈ ఏడాది తామరపురుగు తుడిచిపెడుతోంది. పూత, పిందె, కాయతో దిగుబడి దశకు చేరుకున్న పంట కళ్ల ముందు నాశనమవుతుండటంతో రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు. పెట్టుబడి దశ దాటి సొమ్ము చేసుకునే సమయంలో తుపాన్ తరహాలో తామర పురుగు విజృంభిస్తూ పంటను సర్వనాశనం చేస్తోంది. వ్యవసాయాధికారులు సైతం ఈ చీడ పురుగు నివారణకు సరైన మందులు సూచించలేకపోతున్నారు. అధికార యంత్రాంగం వైఫల్యం కారణంగా శాస్త్రవేత్తల పరిశోధనలు క్షేత్రస్థాయికి చేరడం లేదు. దీంతో పంటను కాపాడుకునేందుకు రైతులు ఆశ చావక ఎవరు ఏం చెప్పినా ఆయా పురుగుమందులను పంటపై పిచికారి చేస్తూ జేబులు గుల్ల చేసుకుంటున్నారు. అందినకాడికి అప్పులు తెస్తూ పనిచేయని పురుగుమందుల కోసం లక్షలు వెచ్చిస్తున్నారు. ఏ పురుగు మందు కొట్టినా తామర పురుగు మాత్రం అదుపులోకి రావడం లేదు. గతేడాది కూడా ఇదే చీడ పంటను ఆశించినప్పటికీ, తొలి కోతలు పూర్తయిన తర్వాత రావడంతో కొంత పెట్టుబడులను రైతు రాబట్టగలిగాడు. ఈ సంవత్సరం మాత్రం పూత, పిందె దశలోనే పంటను చీడ పీడిస్తోంది. అసలే మిర్చి పంట వాణిజ్య పంటల్లో అత్యధిక పెట్టుబడితో కూడుకున్నది. మిర్చి సాగయ్యే పొలాల కౌలు రేట్లు కూడా ఎక్కువే. ఎకరానికి రూ.30 నుంచి రూ.40వేల వరకు కౌలు ధరలున్నాయి. ఇవిగాక దుక్కులు, విత్తనాలు, ఎదలు, కలుపులు, ఎరువులు, పురుగుమందులు వెరసి ఎకరానికి పెట్టుబడి లక్షన్నర పైనే అవుతోంది. దీంతో ఎకరానికి కనీసం 20 క్వింటాలు పండితేనే పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంటుంది. అది కూడా క్వింటా కనీసం రూ.12వేలు అమ్మితేనే. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మార్కెట్‌లో మిర్చికి డిమాండ్ ఉండటం, ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు తొలుత సంబరపడ్డారు. కానీ పంటను సొమ్ము చేసుకునే దశలో తామరపురుగు విజృంభించి నాశనం చేస్తుండటంతో రైతులు ఏం చేయాలో దిక్కుతోచక కన్నీటి పర్యంతమవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అధికారిక లెక్కల ప్రకారం సుమారు 5 లక్షల 90 వేల ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశారు. వీరిలో ఎక్కువమంది కౌలు రైతులు కావడం గమనార్హం. వీరంతా పొలం యజమానులకు ముందే కౌలు చెల్లించారు. పెట్టుబడుల కోసం ప్రతి మిర్చి రైతు లక్షల్లో అప్పులు చేశాడు. ఒకపక్క పంట దెబ్బతిని, మరోపక్క పెట్టుబడిదారులకు డబ్బులు చెల్లించలేని పరిస్థితిలో మిర్చి రైతు పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. వేలాది ఎకరాల్లో ఒక వాణిజ్యపంట సర్వనాశనమవుతున్నా ఇంతవరకు ప్రజాప్రతినిధులు కానీ, వ్యవసాయ శాస్త్రవేత్తలు కానీ క్షేత్రస్థాయిలో పర్యటించి చీడ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు సరైన సలహాలు, సూచనలు ఇవ్వకపోవడం పట్ల రైతు నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విపత్తుగా ప్రకటించి ఎకరానికి లక్ష పరిహారమివ్వాలి: కేవీవీ ప్రసాద్

తామర పురుగు వలన దెబ్బతిన్న మిర్చి పంటకు ఎకరానికి లక్ష రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని, బ్యాంకు నుండి తీసుకున్న రుణాలన్నింటినీ రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, కార్యదర్శి మల్నీడు యలమందరావు డిమాండ్ చేశారు. గతంలో ఉత్తరభారతంలో మిడతల దండు ఇదే తరహాలో విజృంభించి పంటలను నాశనం చేసిన సందర్భంలో కేంద్ర ప్రభుత్వం చట్టాన్ని సవరించి దానినొక విపత్తుగా ప్రకటించి రైతులకు

- మిగతా 2 లో

బీహార్‌లో కులగణన

దేశంలోనే ప్రథమం

చారిత్రక అడుగు: తేజస్వి

పాట్నా: కుల ప్రాతిపదికన జనగణన బీహారులో శనివారం ప్రారంభమైంది. కుల ప్రాతిపదికన జనాభాను లెక్కించడం ఓ చారిత్రక నిర్ణయమని బీహారు ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ పేర్కొన్నారు. సమాజంలోని బలహీనవర్గాలకు సంక్షేమ పథకాలు అందజేయడానికిగాను ఈ ప్రక్రియ ఓ శాస్త్రీయ డేటాను రూపొందిస్తుందని తేజస్వి చెప్పారు. కుల ప్రాతిపదికన జనగణనకు పాలక మహాఘట్‌బంధన్ భాగస్వామ్య పార్టీలన్నీ సానుకూలంగా ఉన్నాయని, బీజేపీకి ఏమాత్రం ఇష్టం లేదని తేజస్వి తెలిపారు. 'నేటి నుంచి బీహార్‌లో కుల ప్రాతిపదికన జనగణన ప్రారంభమైంది. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్య చరిత్రాత్మకం. ఇది పూర్తయితే ప్రభుత్వానికి ఓ శాస్త్రీయ డేటా అందుబాటులోకి వస్తుంది. అణగారిన వర్గాలకు, సమాజంలోని ఇతర ప్రజల అభివృద్ధికి ఇది దోహదపడుతుంది' అని తేజస్వి యాదవ్ విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. బీజేపీని పేదల వ్యతిరేక పార్టీగా అభివర్ణించారు. కుల ప్రాతిపదికన జనగణనను బీజేపీ నిత్యం వ్యతిరేకిస్తోందని విమర్శించారు. కులాల ఆధారంగా జనాభా లెక్కలు తీసుకోవడం వల్ల అన్ని వర్గాలకు లబ్ధి చేకూరుతుందని ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ శుక్రవారం చెప్పారు. కుల గణనకు బీహారు ప్రభుత్వం మద్దతుగా నిలవగా ప్రతిపక్ష బీజేపీ మాత్రం వ్యతిరేకిస్తోంది. ఎస్సీ, ఎస్టీలు

- మిగతా 2 లో

ఆకాశాన్నంటుతున్న గోధుమ ధరలు

- నియంత్రణకు చర్యలు నిల్
- వినియోగదారుల ఇక్కట్లు

న్యూఢిల్లీ : బహిరంగ మార్కెట్లో గోధుమ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిల్వలు తక్కువగా ఉండడం, డిమాండ్ అధికంగా ఉండడంతో గోధుమ ధరలు నానాటికీ పెరిగిపోతున్నాయి. వ్యాపారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడం, కేంద్రం నేటికీ ధరల నియంత్రణకు చర్యలు తీసుకోకపోవడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. గోధుమ సరఫరాల్లో సమస్యలు తలెత్తకుండా బహిరంగ మార్కెట్లో విక్రయాలు జరపాలని కేంద్రం భావిస్తోందనీ, 20.10 లక్షల టన్నుల (2.1మిలియన్లు) గోధుమ నిల్వలను బహిరంగ మార్కెట్లో విక్రయించే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వ అధికారులు చెబుతున్నారు. నిర్దేశిత వస్తువులపై గరిష్ట, కనిష్ట ధరలను నియంత్రించడానికి, ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసి ఆహార వస్తువుల సరఫరా సంక్లిష్టం కాకుండా చూసేందుకు విక్రయాలు జరిపే అవకాశం ఉందని చెప్పారు. అయితే తమ పేర్లు వెల్లడించడానికి వారు ఇష్టపడలేదు. ఎంత పరిమాణంలో గోధుమ నిల్వలను బహిరంగ మార్కెట్లో విక్రయించాలనే విషయంపై ఇంకా పూర్తి అవగాహన రాలేదని తెలిపారు. ఓపెన్ మార్కెట్ సేల్స్ స్కీమ్ (ఓఎంఎస్ఎస్) కింద గోధుమ పరిమాణాన్ని త్వరలో నిర్ణయిస్తారన్నారు. గత ఏడాదిలో జరిగినట్టు కాకుండా ఈసారి ప్రభుత్వం జాగ్రత్తపడే అవకాశం ఉంది.

ఈ ఏడాదిలో ఇప్పటివరకూ తృణధాన్యాల ధరలు పెగుతున్నప్పటికీ ప్రభుత్వం మార్కెట్లో జోక్యం చేసుకోలేదు. తృణధాన్యాల నిల్వలు గడచిన ఐదు సంవత్సరాలలో ఎన్నడూలేనంత అతితక్కువ స్థాయిలో ప్రభుత్వం వద్ద ఉండటమే దీనికి కారణం. 2022 మార్చిలో దేశంలో వేడిగాలుల ఉధృతి అధికంగా ఉండడంతో పంటల దిగుబడులు తగ్గిపోయాయని ప్రభుత్వం చెబుతోంది. ఈ ప్రభావం వల్ల 2022–23 ఆర్థిక సంవత్సరంలో 106 మిలియన్ టన్నులకు (10.60 కోట్ల టన్నులు) గోధుమ ఉత్పత్తి క్షీణించింది. 2021లో గోధుమ ఉత్పత్తి 109 మిలియన్ టన్నులు (10.90 కోట్ల టన్నులు)గా నమోదైంది.

సంక్రాంతి సెలవుల్లో మార్పు

పాఠశాలలకు 11 కాదు 12 నుంచి...

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి : సంక్రాంతి సందర్భంగా పాఠశాలలకు ఏపీ ప్రభుత్వం ప్రకటించిన సెలవుల్లో కొద్దిపాటి మార్పులు చోటు చేసుకున్నాయి. మొదట 11 నుంచి 16వ తేదీ వరకూ విద్యాసంస్థలకు సెలవులను ప్రకటించారు. ఈనెల12 నుంచి 18 వరకు పాఠశాలలకు సంక్రాంతి సెలవులు మంజూరు చేస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్ తాజా ఉత్తర్వులు జారీ చేశారు. విద్యాశాఖ మంత్రికి వచ్చిన వినతుల ఆధారంగా సెలవుల తేదీల్లో మార్పులు జరిపారు. అయితే స్వగ్రామాలకు వెళ్లే ఉపాధ్యాయ కుటుంబాలు చాలా మంది ఇబ్బందులకు గురవుతున్నారు. 10వ తేదీన బస్సు, రైలు టికెట్లు రిజర్వేషన్లు చేయించుకున్నారు. అసలే సంక్రాంతికి బస్సులు, రైళ్లన్నీ రద్దీగా ఉంటాయి. సెలవులు మారడంతో దూరప్రాంతాలకు వెళ్లే ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రిజర్వేషన్‌లు దొరక్క ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడింది.

విద్యార్థులకు 'పరీక్ష' కాలం

పోటీ పరీక్షల తేదీలు ఇలా... 2లో

ఇదీ లోకం!



పోన్లే, వచ్చే ఎన్నికలకు నా ఖర్చులు తగ్గుతాయి!

ధాన్యం కొనుగోళ్లలో దళారీలదే హవా!

- బ్యాంక్ గ్యారంటీ లేదంటున్న అధికారులు
- వ్యాపారులను ఆశ్రయిస్తున్న అన్నదాతలు
- 'ప్రైవేట్' చేతివాటంతో చితికిపోతున్న రైతన్న

2లో

ఇంటి జాగా కోసం భూ ఆక్రమణ

- పేదలకు అండగా సీపీఐ, వ్యవసాయ కార్మికసంఘం
- ప్రభుత్వ భూమిలో సీపీఐ జెండాలు
- గుడిసెలు నిర్మించిన పేదలు
- జల్లి విల్సన్, ఆవుల శేఖర్ నాయకత్వం

నంద్యాల జిల్లా పాములపాడు మండలం బానకచెర్ల గ్రామంలో ఐదెకరాల ప్రభుత్వ భూమిని పేదలు శనివారం ఆక్రమించుకున్నారు. ఈ భూ పోరాటానికి సీపీఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం నాయకత్వం వహించాయి.

2లో

అమెరికా ప్రతినిధుల సభ

స్పీకర్‌గా కెవిన్ మెక్‌కార్తీ

- 15 రౌండ్ల తర్వాత దక్కిన మెజారిటీ
- సొంతపార్టీలో 20 మంది రెబల్స్
- చర్చలు-వాగ్వాదాలతో ఓటింగ్
- చివరి క్షణంలో అనుకూల ఓటింగ్
- రిపబ్లికన్లను వరించిన విజయం

వాషింగ్టన్: అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్‌గా కెవిన్ మెక్‌కార్తీ (57) ఎన్నికయ్యారు. 430 మంది సభ్యులున్న సభలో స్పీకర్‌గా ఎన్నిక కావాలంటే 218 ఓట్లు రావాలి. రిపబ్లికన్ పార్టీకి స్వల్ప మెజారిటీ ఉండటంతో కెవిన్ సునాయాసంగా గెలవాల్సింది. కానీ 20మంది సొంతపార్టీ సభ్యులే ఆయన అభ్యర్థిత్వాన్ని సమర్థించకపోవడంతో మెజారిటీ రాలేదు. 15 రౌండ్ల వరకు ఇదే పరిస్థితి ఉండగా చివరి నిమిషంలో రెబల్స్ తమ నిర్ణయాన్ని మార్చుకొని అనుకూలంగా ఓటు వేశారు. దీంతో మ్యాజిక్ ఫిగర్ రావడంతో ప్రతినిధుల సభకు 55వ స్పీకర్‌గా కెవిన్ మెక్‌కార్తీ ఎన్నికయ్యారు. కాంగ్రెస్ సభ్యులు మ్యాట్‌గెట్స్‌తో పాటు మరో ఐదుగురు చివరి నిమిషం వరకు కెవిన్‌కు ఓటు వేసేందుకు అంగీకరించలేదు. దీంతో 14-15వ రౌండ్‌లలోనూ గెట్స్‌తో కెవిన్ మాట్లాడారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం కూడా జరిగింది. గేట్స్‌ను మరోనేత మైక్ రోజర్స్ నిలదీయగా, అదే పార్టీకి చెందిన రిచర్డ్ హడ్‌సన్ వెంటనే జోక్యం చేసుకొని రోజర్స్‌ను శాంతింపజేశారు. 13వ రౌండులోనూ అనుకూల ఓటింగ్ జరగకపోవడంతో కెవిన్ విసుగ్గా ఉన్నారు. అయితే స్పీకర్ అభ్యర్థులకు ఇలాంటి పరిస్థితులు కొత్త కాదని, గతంలోనూ 15 మంది కూడా కెవిన్ తరహా పరిస్థితిని ఎదుర్కొన్నారని ఎన్బీసీన్యూస్ గుర్తుచేసింది.డెమొక్రటిక్ పార్టీకి చెందిన నాన్సీ పెలోసీ (82) స్థానాన్ని కెవిన్ భర్తీచేస్తారు. శక్తిమంతమైన స్పీకర్ పదవిలో ఉండి దేశ విధానాలు, బడ్జెట్ సంబంధిత అంశాల్లో కీలకంగా వ్యవహరించడమే కాకుండా దేశాధ్యక్షుడు జో బైడెన్, ఉపాధ్యక్షులు కమలాహారిస్ వారసులవుతారు. ప్రతినిధుల సభలో ఐదుగురు భారత సంతతి అమెరికన్ సభ్యులు ఉన్నారు. డాక్టర్ అమీబెరా, రాజా కృష్ణమూర్తి, రో ఖన్నా, ప్రమీలా జయపాల్, శ్రీ థానేదార్ డెమొక్రటిక్ పార్టీకి చెందినవారే. వీరంతా 14వ రౌండులో జెఫ్రీస్‌కు ఓటేశారు.

కలిసి పనిచేద్దాం: బైడెన్

అమెరికా ప్రతినిధుల సభకు స్పీకర్‌గా ఎన్నికైన కెవిన్ మెక్‌కార్తీకి అధ్యక్షుడు జో బైడెన్ శుభాకాంక్షలు తెలిపారు. రిపబ్లికన్లతో కలిసి పనిచేసేందుకు అధ్యక్షుడు సిద్ధంగా ఉన్నట్లు శ్వేతసౌధం ప్రకటించింది. 'స్పీకర్‌గా ఎన్నికైన కెవిన్ మెక్‌కార్తీకి నేను, జిల్ శుభాకాంక్షలు తెలుపుతున్నాం. మధ్యంతర ఎన్నికలప్పుడు చెప్పినట్లుగానే రిపబ్లికన్లతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నా. అదే విధంగా వారు కూడా నాతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలి. దీనినే ఓటర్లు కోరుకునేది' అని బైడెన్ ప్రకటన పేర్కొంది.

ట్రంప్‌కు ఒకే ఒక్క ఓటు...

స్పీకర్ పదవికి పోటీలో చిత్తైన మాజీ అధ్యక్షుడు

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతినిధుల సభలో స్పీకర్ పదవికి పోటీ చేసి చిత్తయ్యారు. ఆయనకు కేవలం ఒకే ఒక్క ఓటు వచ్చింది. అదీగాక ఈ పదవి కోసం ఆయనను నమినేట్ చేసిన వ్యక్తి మినహా ఏ నేత ట్రంప్‌కు ఓటు వేయకపోవడం గమనార్హం. మధ్యంతర ఎన్నికల తర్వాత అమెరికా కాంగ్రెస్ దిగువ సభలో ప్రతిపక్ష రిపబ్లికన్ పార్టీకి స్వల్ప మెజారిటీ లభించింది. తమ నాయకుడిని సభాపతిగా ఎన్నుకునేందుకు ఆ పార్టీ నేతలు కసరత్తు చేశారు. దాదాపు మూడు రోజుల పాటు కష్టపడ్డారు. ఈ క్రమంలోనే మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ నేత డొనాల్డ్ ట్రంప్ రేసులోకి వచ్చారు. 15వ రౌండ్‌తో స్పీకర్ ఎన్నికలకు తెరపడి కెవిన్ మెక్ కార్తీ ఎన్నికయ్యారు.

విద్యార్థులకు 'పరీక్ష' కాలం

పోటీ పరీక్షల తేదీలు ఇలా...

న్యూఢిల్లీ: ఇది పరీక్షల కాలం. విద్యార్థులు తమలోని సత్తా చాటేలా సర్వసన్నద్ధమయ్యేందుకు అత్యంత కీలక సమయం. ఓవైపు వార్షిక పరీక్షలు సమీపిస్తుండగా.. మరోవైపు, ఉన్నత చదువులు, పైతరగతులకు ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో ప్రవేశాల కోసం నిర్వహించే అర్హత పరీక్షల తేదీలు సైతం దగ్గరపడుతున్నాయి. దీంతో వీటిని సమతుల్యం చేసుకొనేలా విద్యార్థులు తమను తాము సమాయత్తం చేసుకోవడంతో పాటు పక్కా ప్రణాళికతో సన్నద్ధం కావడం కీలకం. దీంతో 2023-24 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే కొన్ని ముఖ్యమైన పోటీ పరీక్షల తేదీలను పరిశీలిద్దాం.

దేశంలోని ప్రఖ్యాత విద్యా సంస్థల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ మెయిన్ మొదటి విడత పరీక్ష జనవరి 24 నుంచి 31 వరకు జరగనుంది. అనూహ్యంగా వచ్చే ఆటంకాలను దృష్టిలో పెట్టుకుని ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు నిర్వహించేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సన్నాహాలు చేసింది. జేఈఈ మెయిన్ రెండో విడత ఏప్రిల్ 6 నుంచి 12 వరకు జరగనున్నాయి. ఏవైనా ఆటంకాలు ఎదురైతే ఏప్రిల్ 13, 15 తేదీలను అందుబాటులో ఉంచినట్లు ఎన్‌టీఏ తెలిపింది. జేఈఈ మెయిన్ పరీక్షలకు లక్షలాది మంది విద్యార్థులు పోటీపడుతుంటారు. దేశంలోని ప్రతిష్ఠాత్మక ఐఐటీల్లో 2023-24 విద్యా సంవత్సరానికిగాను బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను జూన్ 4న నిర్వహించనున్నారు. ఈసారి ఈ పరీక్షను ఐఐటీ గువహతి నిర్వహిస్తోంది. జేఈఈ మెయిన్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఈ పరీక్ష కోసం ఏప్రిల్ 30 నుంచి మే 4 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే, దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ యూజీ-2023 పరీక్ష మే 7న జరగనుంది. పోస్టు గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు ఏటా నిర్వహించే నీట్ పీజీ పరీక్ష మార్చి 5న జరగనుంది. దేశవ్యాప్తంగా 367 నగరాల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వెల్లడించింది. దేశంలోని విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఉమ్మడి విశ్వవిద్యాలయాల ప్రవేశ పరీక్ష క్యూట్-2023 పరీక్ష మే 21 నుంచి 31 మధ్య నిర్వహించనున్నట్టు ఎన్‌టీఏ ప్రకటించింది. ఈ పరీక్షలకు సంబంధించి ఏవైనా ఆటంకాలు ఎదురైతే జూన్ 1 నుంచి 7వరకు తేదీలను రిజర్వు చేసింది. జూనియర్ రీసెర్చి ఫెలోషిప్, విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు పోటీపడేందుకు అవకాశం కల్పించే యూజీసీ-నెట్ డిసెంబర్ 2022 పరీక్ష ఫిబ్రవరి 23 నుంచి మార్చి 10వరకు జరగనుంది. మొత్తం 83 సబ్జెక్టులకు నిర్వహించే కంప్యూటర్ ఆధారిత పరీక్ష కోసం జనవరి 17 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. ఇక ప్రతిష్ఠాత్మక ఐఐటీలతోపాటు ఐఐఎస్‌సీ బెంగళూరు, వివిధ ఎన్ఐటీలు, ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఇంజినీరింగ్, టెక్నాలజీ, ఆర్కిటెక్చర్, ఫార్మసీ విభాగాల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే గేట్ 2023 పరీక్ష ఫిబ్రవరిలో జరగనుంది. గేట్ (గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్)- 2023 పరీక్ష ఫిబ్రవరి 4, 5, 11, 12 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఐఐటీ కాన్పూర్ వెల్లడించింది. మార్చి 16న ఫలితాలు వెల్లడికానున్నాయి. దేశవ్యాప్తంగా 649 జవహర్ నవోదయ విద్యాలయల్లో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 29న జరగనుంది. ఈ పరీక్ష కోసం జనవరి 31వరకు దరఖాస్తులు చేసుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో 15, తెలంగాణలో 9 జేఎన్‌వీలు ఉన్నాయి. ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపికైన విద్యార్థులు 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉచిత విద్య పొందొచ్చు.

కార్మిక సంఘాల స్వేచ్ఛకు పోరు

- బ్రిటన్ ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలను ప్రతిఘటిద్దాం
- కార్మిక వ్యతిరేక చట్టాలను తిప్పికొడదాం
- యంగ్ కమ్యూనిస్ట్ లీగ్ పిలుపు

లండన్: కార్మికసంఘాల స్వేచ్ఛకు విఘాతం కలిగించే విధంగా అప్రజాస్వామిక చర్యలు - కార్మిక వ్యతిరేక చట్టాలు తెస్తున్న బ్రిటన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరు తప్పదని యంగ్ కమ్యూనిస్ట్ లీగ్ (వైసీఎల్) పేర్కొంది. బ్రిటన్‌లో కార్మిక ఉద్యమాల అణచివేత దిశగా కొత్త చట్టాలను తెస్తోందని, వీటిని అడ్డుకోవాలని పిలుపునిచ్చింది. కార్మిక సంఘాల స్వేచ్ఛను కోసం పోరాడాల్సిందేనని తెలిపింది. బ్రిటన్ ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలను-కార్మిక వ్యతిరేక కొత్తచట్టాలను తిప్పికొడదామని కార్మిక వర్గానికి, బ్రిటన్ ప్రజలకు పిలుపునిచ్చింది. 'బ్రిటన్‌లో సమ్మె హక్కు లేకుండా చేసేందుకు కార్మిక ఉద్యమాల అణచివేత దిశగా కార్మిక సంఘాలపై దాడి చేసే కొత్త చట్టాన్ని బ్రిటన్ ప్రభుత్వ తెస్తోంది. ఇప్పటికే కార్మిక సంఘాలకు వ్యతిరేకమైన అనేక కఠిన చట్టాలు ఉన్నాయి. ఇప్పుడు ఎనిమిది కీలక రంగాల (ఎన్‌హెచ్ఎస్, అంబులెన్స్, రైల్, స్కూళ్లు, సరిహద్దు భద్రత, అగ్నిమాపక దళం, అత్యవసర బలగాలు, అణు నేపథ్య రంగాల్లో)పై బ్రిటన్ ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఈ రంగాల్లో సమ్మెలు లేకుండా చేయాలని 'కనీస సేవల స్థాయిలు' (మినిమం సర్వీస్ లెవల్స్) అమలుకు సిద్ధమైంది. కార్మికులకు పనిలక్ష్యాన్ని విధించాలని భావిస్తోంది. నిర్దేశిత స్థాయిలో పని చేయని కార్మికులను విధుల నుంచి తొలగించే హక్కు యాజమాన్యాలకు కల్పిస్తున్నది. అంతేకాకుండా కార్మిక సంఘాలపై కోర్టు కేసులకూ మార్గం సుగమం చేస్తోంది' అని యంగ్ కమ్యూనిస్ట్ లీగ్ ప్రకటన పేర్కొంది. 'బ్రిటన్ ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులపై దాడి చేస్తోంది. కార్మికోద్యమాలకు ఈ చట్టాలు 'రెడ్‌లైన్' వంటివి. ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలను బ్రిటన్‌తో పాటు అన్ని ప్రధాన కార్మికసంఘాలు విజయవంతంగా తిప్పికొట్టగలవు. కార్మిక సంఘాల స్వేచ్ఛ కోసం ఉద్యమంగా పోరాటం జరగాలి. ఈ చట్టాలను ఉపసంహరించుకునేందుకు పోరాడదామ'ని పిలుపునిచ్చింది. 'పనిప్రదేశాల్లో క్రియాశీలంగా ఉండాలి. బ్రిటన్ వ్యాప్తంగా, స్థానిక పికెట్‌లైన్లలో జరిగే సమ్మెలకు మద్దతివ్వాలి. కొత్త కార్మిక వ్యతిరేక చట్టాలను తిప్పికొట్టాలి. టీయూసీతో పాటు అన్ని కార్మిక సంఘాల స్వేచ్ఛ కోసం పోరాడాలి.

వైసీఎల్, కమ్యూనిస్టు పార్టీలో చేరాలి. సామ్యవాదం, శ్రామికవర్గం కోసం పోరాటాల్లో మీ వంతు పాత్ర పోషించాలి. పాలకపక్షం దాడులకు శాశ్వత ముగింపు పలకాలి' అన్నది బ్రిటన్ కమ్యూనిస్టుల వైఖర'ని యంగ్ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రకటన తెలిపింది.

ఇంటి జాగా కోసం భూ ఆక్రమణ

విశాలాంధ్ర-పాములపాడు: నంద్యాల జిల్లా పాములపాడు మండలం బానకచెర్ల గ్రామంలో ఐదెకరాల ప్రభుత్వ భూమిని పేదలు శనివారం ఆక్రమించుకున్నారు. ఈ భూ పోరాటానికి సీపీఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం నాయకత్వం వహించాయి. 20 ఏళ్లుగా పోరాడుతున్నా ప్రభుత్వంగానీ, పాలకులు గానీ, అధికారులు గానీ స్పందించలేదు. పైగా ఆ భూమిని దేవలాపురానికి చెందిన సర్వోత్తమరావుకు రెవెన్యూ అధికారులు కట్టబెట్టారు. ఆయన తన భార్య పేరున పాస్‌పుస్తకాలు తెప్పించుకున్నారు. దానితో బానకచెర్ల గ్రామంలోని ఐదెకరాల ఈ ప్రభుత్వ స్థలాన్ని కొత్త బానకచెర్ల, పాత బానకచర్ల, గుండాలనట్టు గ్రామస్తులు శనివారం ఆక్రమించుకున్నారు. ఈ భూములు తమకు పంపిణీచేయాలని కోరుతూ సీపీఐ, వ్యవసాయ కార్మికసంఘం నాయకత్వంలో మూడు గ్రామాల ప్రజలు ఏళ్ల తరబడి పోరాడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయకులు, సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, రమేష్ బాబు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రఘురామమూర్తి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు అధ్వర్యంలో మూడు గ్రామాల ప్రజలు బస్టాండ్ నుంచి ర్యాలీగా బయలుదేరి ఆ స్థలం వద్దకు చేరుకున్నారు. ఆ స్థలంలో జెండాలు పాతారు. గుడిసెలు వేశారు. అనంతరం జరిగిన సభలో జల్లి విల్సన్ మాట్లాడుతూ పోరాటాల ద్వారానే భూమిని సాధించుకోగలమన్నారు. కొత్త బానకచెర్ల, పాతబానకచెర్ల, గుండాలనట్టు ప్రజలు ఇంటి స్థలం కోసం 20 ఏళ్లుగా పోరాటం కొనసాగించడం అభినందనీయమన్నారు. గ్రామస్తులకు సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం అండగా ఉంటుందన్నారు. ఈ రోజు ఇంటి స్థలాలు చేజిక్కించుకున్నామని, ఉగాది నాటికి అందరూ గృహాలు నిర్మించుకోవాలని కోరారు. రెండు తెలుగు రాష్ట్రాలలో సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో అనేక భూ పోరాటాలు జరిగాయని, వేలాది ఎకరాలను పేదలకు పంపిణీ చేశామని చెప్పారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా ఏర్పాటు చేసిన కోనేరు రంగారావు కమిటీ సిఫారసులను ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆవుల శేఖర్, రామాంజనేయులు, రంగనాయకులు మాట్లాడారు. దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి ప్రభాకర్, సీపీఐ మండల నాయకులు ప్రసాద్, ప్రతాప్, మహిళా నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, మూడు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

లా కాలేజీ ప్రిన్సిపాల్స్ నియామకం రద్దు

తిరువనంతపురం: యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో మూడు ప్రభుత్వ న్యాయ కళాశాలల ప్రిన్సిపాళ్లను కేరళ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్(క్యాట్) పక్కన పెట్టింది. తిరువనంతపురం, ఎర్నాకులం, త్రిస్సూర్ ప్రభుత్వ లా కాలేజీల ప్రిన్సిపాళ్ల నియామకాలను క్యాట్ సభ్యులు జస్టిస్ పీవీ ఆశా, పీకే కేశవన్ రద్దు చేశారు. యూజీసీ నిబంధనలకు అనుగుణంగా ప్రిన్సిపాల్స్‌ను కొత్తగా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ట్రిబ్యునల్ ఆదేశించింది. న్యాయ కళాశాలల ప్రిన్సిపాల్స్ నియామకానికి సంబంధించి యూజీసీ నిబంధనలు సక్రమంగా అమలు జరిగినట్లు కనిపించడం లేదని, అందుకే ఆ నియామకాలను రద్దు చేస్తున్నట్లు క్యాట్ సభ్యులు స్పష్టంచేశారు. ఎర్నాకులం న్యాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ గిరిశంకర్ ఎస్ఎస్ దాఖలు చేసిన పిటిషన్‌పై ట్రిబ్యునల్ విచారణ జరిపింది.

కార్మిక హక్కులపై ఉక్కుపాదం

(మొదటిపేజీ తరువాయి)

కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, జాతీయ నాయకులు వీయస్ బోస్, పీజే చంద్రశేఖర్ పాల్గొన్నారు. అమర్‌జీత్‌కౌర్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను పరిశ్రమల అధిపతులకు, పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చిందని ఆరోపించారు. యూనియన్ పెట్టుకునే హక్కు రాజ్యాంగం కల్పించినప్పటికీ మోదీ ప్రభుత్వం చట్టాలు మార్పు ద్వారా ఆ హక్కుపై ఉక్కుపాదం మోపుతున్నదని ధ్వజమెత్తారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ అది అమలుకు నోచుకోలేదని అమర్‌జిత్ కౌర్ అన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను పథకం ప్రకారం నిర్వీర్యం చేసి కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు ధారాదత్తం చేస్తున్నదని మోదీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. మహోజ్వల పోరాటాల ద్వారా ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించుకుంటామని స్పష్టం చేశారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను సైతం అమలు చేయటం లేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థల్లో ఖాళీలు భర్తీ చేయాలని, ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ సంస్థల్లో పర్మినెంట్ విధానం ఉండాలని రాజ్యాంగం స్పష్టంచేసినప్పటికీ మోదీ ప్రభుత్వం కాంట్రాక్ట్ విధానాన్ని ప్రోత్సహిస్తోందని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థల్లో ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న 20 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని, ప్రభుత్వరంగ సంస్థల్లో కాంట్రాక్ట్ విధానానికి స్వస్తి చెప్పాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం అదానీ, అంబానీలకు వత్తాసు పలుకుతోందని ధ్వజమెత్తారు. 2021, 2022 వార్షిక సంవత్సరంలో ప్రభుత్వ బ్యాంకులు కోట్లాది రూపాయల లాభాలు ఆర్జించాయని, ప్రభుత్వ బ్యాంకులు సరిగా పనిచేయవన్న ప్రభుత్వానికి ఇది సరైన గుణపాఠమన్నారు. కార్మికవర్గానికి మేలు చేయని మోదీ ప్రభుత్వం...కార్పొరేట్ వర్గాలకు 18 లక్షల కోట్ల రూపాయల రుణాలు మాఫీ చేసిందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.ఏసుతరత్నం, కార్యదర్శులు ఎస్.కరుణకుమారి, బి.వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో దళారీలదే హవా!

విశాలాంధ్ర-వేపాడ: ధాన్యం కొనుగోళ్లలో దళారుల హవా కొనసాగుతోంది. ఆర్‌బీకేల్లో బ్యాంక్ గ్యారంటీలు వేవని అధికారులు చెబుతుండడంతో ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం దళారులకు కట్టబెట్టడానికే అన్నదాతలు మొగ్గు చూపుతున్నారు. ఇదే అదనుగా భావించిన ప్రైవేట్ వ్యాపారులు కొందరు బస్తాకు నాలుగు కేజీలు అదనంగా తూకం వేస్తూ రైతన్నల కాయకష్టాన్ని దోచుకుంటున్నారు. నగదు చెల్లింపునకు 15 రోజుల గడువు విధిస్తూ రైతు అంగీకరిస్తే 84 కేజీల బస్తా రూ.1,350, రూ. 1400లకు కొనుగోలు చేస్తూ నిలువుదోపిడీ చేస్తున్నారు. ఆర్‌బీకేల్లో నిబంధనలు దళారులకు వరంగా మారాయి.

విజయనగరం జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరించేందుకు 510 కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రైతు భరోసా కేంద్రాల(ఆర్‌బీకే)లో బ్యాంకు గ్యారంటీలు లేవని చెబుతుండడంతో రైతులు గత్యంతరం లేని పరిస్థితుల్లో దళారీలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా భావించిన దళారులు బస్తాకు 84 కేజీల చొప్పున తూకం వేస్తూ అదనంగా మరో నాలుగు కేజీలు పట్టుకుపోతున్నారు. ప్రభుత్వం 100 కేజీల ఏ గ్రేడ్ ధాన్యం బస్తా రూ.2,060, కామన్ రకం రూ. 2,040 ధర నిర్ణయించింది. అలాగే 80 కేజీల ఏ గ్రేడ్ బస్తా రూ.1,680, కామన్ రకం రూ.1,640 కొనుగోలు చేయాలని నిబంధన విధించింది. ఆర్‌బీకేల్లో నిబంధనలకు భయపడిన రైతన్నలు దళారులను ఆశ్రయిస్తుండడంతో బస్తా 80 కేజీలకు బదులు84 కేజీలు వరకు తూకం వేసుకుంటూ చేతివాటం చూపుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రైవేటు వ్యాపారుల పరిస్థితి ఇలా ఉంటే... ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కూడా 84 కేజీల 100 గ్రాముల ధాన్యం తూకం వేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ధాన్యం రవాణాకు టక్కులు ఏర్పాటు చేయకపోవడంతో ధాన్యం కల్లాల వద్దనే ఉండిపోతోందంటున్నారు. ప్రభుత్వ కొనుగోళ్లు సక్రమంగా జరగకపోవడంతో రైతు అవసరాన్ని దళారీలు క్యాష్ చేసుకుంటున్నారు. తక్షణమే నగదు చెల్లింపునకు అంగీకరిస్తే 84 కేజీల 100 గ్రాములకు రూ.1,250, పది పదిహేను రోజులకు రైతు అంగీకరిస్తే రూ.1,350 నుంచి రూ.1400 చొప్పున ధాన్యం కొనుగోలు చేస్తూ రైతును నిలువు దోపిడీ చేస్తున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యంకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినప్పటికీ ... ధర రైతుకు ఎండమావిగానే మిగిలిందని చెప్పవచ్చు. ఈ ఏడాది 2.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటి వరకు1లక్ష 92వేల 233 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోళ్లు చేపట్టినట్లు జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ కె.త్రినాథస్వామి తెలిపారు. ఇదిలా ఉండగా, శృంగవరపుకోట, వేపాడ, లక్కవరపుకోట, కొత్తవలస మండలాల్లో అధిక శాతం దళారీలదే హవా కొనసాగుతోంది. ఆర్‌బీకేలు పరిమితం కావడంతో వ్యాపారులు రైతుల కల్లాల వద్దకే వెళ్లి కొనుగోళ్లు జరుపుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా వ్యవసాయ శాఖ, రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు కల్లా వద్దే ధాన్యం కొనుగోళ్లు నిర్వహిస్తే రైతు మోసపోకుండా ఉంటారని చాలామంది తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ దిశగా పాలకులు, అధికారులు ఏ మేరకు చర్యలు చేపడతారో వేచి చూడాల్సిందే.

బీహార్‌లో కులగణన

(మొదటిపేజీ తరువాయి)

మినహా ఇతర కులాలతో కూడిన జనాభా లెక్కలు చేయలేమని కేంద్ర ప్రభుత్వం చేతులెత్తేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రక్రియ ప్రారంభించింది. బీహారులో రెండు దశల్లో జనగణన చేపట్టనున్నట్లు అధికారి ఒకరు చెప్పారు. మొదటిదశలో కుటుంబ సభ్యులందరినీ లెక్కిస్తారని, ఇది జనవరి 21 వరకు కొనసాగుతుందని చెప్పారు. రెండో దశ మార్చిలో ప్రారంభమవుతుందని, అన్ని కులాలు, ఉపకులాలు, మతానికి సంబంధించిన అన్ని వివరాలు నమోదు చేస్తామని చెప్పారు. ప్రజల ఆర్థిక స్థితిగతులను సైతం అధికారులు సేకరిస్తారన్నారు.

ఉద్యమించాలి

(మొదటిపేజీ తరువాయి)

అనుమతి తీసుకోవాలని తెలిపారు. విశాఖ డివిజన్‌తో కూడిన రైల్వే జోన్ ఎన్ఏడి జంక్షన్-బీహెచ్‌పీవీ మధ్య శాటిలైట్ రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో అట్టడుగు వర్గాల ప్రజలకు అభివృద్ధిలో భాగస్వామ్యం లేదని, ఉత్తరాంధ్రలో ప్రాజెక్టులు నిర్మించి ఉంటే వెనుకబాటుతనం ఉండేది కాదని అభిప్రాయపడ్డారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నిధులు ఇచ్చే పరిస్థితుల్లో లేదని, రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని నిలదీసే పరిస్థితుల్లో లేదని అన్నారు. సుజల స్రవంతి కోసం పోరాటానికి సిద్ధం కావాలన్నారు. ఉన్న పరిశ్రమలను ప్రైవేటుపరం చేస్తున్నారని, ఈ పరిస్థితుల్లో కొత్త పరిశ్రమలు వచ్చే అవకాశం కనిపించడం లేదని చెప్పారు. రాష్ట్రానికి వస్తున్న పరిశ్రమలను బెదిరించి వెళ్లగొడుతున్నారని, అనంతపురంలో జాకీ సంస్థ కర్మాగారం ఏర్పాటుకు ముందుకు వస్తే స్థానిక ఎమ్మెల్యే ఎన్నికల ఖర్చులో సగం మొత్తం రూ.10 కోట్లు డిమాండ్ చేశారని, దాంతో ఆ పరిశ్రమ తెలంగాణకు వెళ్లిపోయిందని చెప్పారు. 15 వేల మందికి ఉపాధి కల్పిస్తున్న అమరరాజాను ఇబ్బందులకు గురి చేస్తే, ఆ పరిశ్రమ కూడా తెలంగాణకు వెళ్లిపోయిందని చెప్పారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 30న నిర్వహించే కార్మిక గర్జనలో అన్ని పార్టీలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో దీనికి మద్దతుగా అన్ని జిల్లాల్లో దీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కొవ్వాడలో కేంద్రం తలపెట్టిన అణు విద్యుత్ ప్లాంట్ ల్యాండ్ మైన్ లాంటిదని అన్నారు. ప్రత్యేక ప్యాకేజీ విషయంలో రాష్ట్రాన్ని కేంద్రం వెన్నుపోటు పొడిచిందన్నారు. విభజన హామీలను కేంద్రం అమలు చేయలేదని విమర్శించారు. గిరిజన సబ్ ప్లాన్ లేదని, కార్పొరేట్ తరహా నీతి అయోగ్‌ని ఏర్పాటు చేశారని అన్నారు. రాష్ట్రంలో 22 చక్కెర ఫ్యాక్టరీలు మూతపడ్డాయన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నిలబెట్టుకోవాలని, ప్రభుత్వ రంగం లేకపోతే విశాఖ అభివృద్ధి లేదని అన్నారు. అమూల్ వల్ల ఒరిగిందేమీ లేదని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టులో పునరావాసంతో సంబంధం లేదని కేంద్రం అనడం బాధ్యతా రాహిత్యమని దుయ్యబట్టారు. తెలుగుదేశం నేత చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధికి పార్టీలకు అతీతంగా కృషి చేయాలని, నాయకులంతా దీనికి ముందుకు రావాలని, ఒక కార్యాచరణ రూపొందించాలని అన్నారు. గత ప్రభుత్వాలు మంచి కార్యక్రమాలు చేస్తే కొనసాగించడం మంచి పని అని అభిప్రాయపడ్డారు. ప్రజలు ఓటుకు డబ్బులు తీసుకున్నంతకాలం మంచి నాయకులు రారని అన్నారు. విశాఖలో రూ.45 వేల కోట్ల విలువైన ప్రైవేటు భూములను విజయసాయిరెడ్డి ఆక్రమించుకున్నారని విమర్శించారు. కత్తిపూడి వద్ద 121 హెక్టార్ల రిజర్వ్ ఫారెస్ట్ నుంచి బాక్సైట్‌ను భారతి సిమెంట్ పేరు రాసి ఉన్న లారీలతో కడప తరలిస్తున్నారని, పోలీసులే ఈ లారీలను దగ్గరుండి పంపిస్తున్నారని చెప్పారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం పార్టీ కార్యాలయంగా మారిపోవడం దురదృష్టకరమని అన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఏడాదిలో మద్యం దుకాణాలను మూసివేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి జగన్... 25 ఏళ్లపాటు మద్యం దుకాణాలను తాకట్టు పెట్టి ఎనిమిది వేల కోట్లు రుణం తీసుకున్న ఘనుడని విమర్శించారు. విశాఖలోని ప్రభుత్వ భూములను తాకట్టు పెట్టి రుణం పొందారని అన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే కేసులు పెడుతున్నారని విమర్శించారు. జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధి శంకుస్థాపనలకే పరిమితమవుతోందని అన్నారు. మత్స్యకారుల కోసం జెట్టీలు నిర్మించాలని, సుజల స్రవంతి ప్రాజెక్టును పూర్తి చేయాలని, ఉత్తరాంధ్ర అభివృద్ధికి బోర్డు ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ నీటి సదుపాయం కల్పించి వ్యవసాయం అభివృద్ధి చేయాలని, ఇప్పటికీ 80 శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారని అన్నారు.

విద్య, వైద్య సదుపాయాలను మెరుగుపరచాలన్నారు. ప్రొఫెసర్ కేఎస్ చలం మాట్లాడుతూ ఉత్తరాంధ్ర నుంచి ఉపాధి కోసం వలసలు అధిక సంఖ్యలో ఉన్నాయన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ నుంచి కాపాడుకోవాలన్నారు. ఈ సదస్సులో నన్నయ విశ్వవిద్యాలయం మాజీ వీసీ ముత్యాల నాయుడు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, లోక్‌సత్తా నాయకులు భీశెట్టి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

జయప్రకాష్ నారాయణకు నిరసన సెగ

లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ ప్రసంగాన్ని ముగిస్తున్న సమయంలో స్టీల్ ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులు స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటానికి మద్దతు తెలపాలంటూ నినాదాలు చేశారు. విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు, ఆంధ్రుల జీవనాడి - విశాఖ ఉక్కు అంటూ నినాదాలు చేశారు. దీనిపై జయప్రకాష్ నారాయణ ఎవరి అభిప్రాయం వారిదంటూ నినాదాలను ఆపే ప్రయత్నం చేశారు. శ్రీలంకకు చెందిన బ్రాండిక్స్ కంపెనీ వేల మందికి ఉపాధి కల్పిస్తుందని, వాళ్లు దేశభక్తులని పేర్కొనడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. బ్రాండిక్స్‌లో కార్మికులకు కనీస వేతనాలు, హక్కులు అమలు కావడం లేదన్న విమర్శలను ఆయన విస్మరించారని అనేక మంది అభిప్రాయపడ్డారు.

'తామర' తుపాను

(మొదటిపేజీ తరువాయి)

ఆర్థిక సహాయం చేసిందని వారు గుర్తు చేశారు. అదే తరహాలో మిర్చి రైతుకి ఎకరానికి లక్ష చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు తక్షణమే క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు అవసరమైన సూచనలు ఇవ్వాలని కోరారు. విత్తనం దగ్గర నుంచి పంట విక్రయం వరకు రైతుకి అండగా ఉంటున్నట్లు చెపుతున్న రైతు భరోసా కేంద్రాలు అన్నదాతకు ఏమాత్రం భరోసా ఇవ్వలేకపోతున్నాయని విమర్శించారు.

గతేడాది కూడా తామర పురుగు వల్లనే లక్షలాది ఎకరాలలో పంట ధ్వంసమై ఆర్థికంగా నష్టపోయారని, అయినా ప్రభుత్వం ఈ ఏడాది ఎటువంటి ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లే రైతాంగం తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవడానికి యుద్ధ ప్రాతిపదిక చర్యలు చేపట్టాలని, మిర్చి తోటలు వేసిన రైతాంగంలో 90 శాతం మంది వాస్తవ సాగుదారులైన కౌలురైతులకు పరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

సొంతూళ్లకు చైనీయులు

కొత్త సంవత్సరం వేళ ఆంక్షల సడలింపు

బీజింగ్: లూనార్ న్యూయర్ వేడుకలకు చైనా సిద్ధమైంది. ఈ నెల 22 నుంచి జరుపుకోనున్నది. దీంతో ప్రయాణాలపై ఆంక్షలను సడలిస్తూ అక్కడి జిన్‌పింగ్ ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీచేసింది. దీంతో చైనా ప్రజలు సొంతూళ్ల బాట పడుతున్నారు. 2020 తర్వాత కోవిడ్ క్రమంలో ఆంక్షలు కొనసాగుతూ వచ్చాయి. తాజా సడలింపులతో 40 రోజుల్లో 200 కోట్ల మంది రాకపోకలు సాగించనున్నట్లు చైనా రవాణా శాఖ అంచనా వేసింది. తమ వారితో కొత్త సంవత్సరం జరుపుకోవచ్చని సంబరపడుతున్నారు. ఇదిలావుంటే, మరికొందరు కొవిడ్ వ్యాప్తి చెందవచ్చన్న భయాన్ని వ్యక్తం చేస్తున్నారు. నగరాల నుంచి గ్రామాలకూ వైరస్ సోకుతుందని, వైద్య సదుపాయాల కొరత ఉన్న దగ్గర కరోనా విజృంభిస్తే పరిస్థితులు మరింత క్లిష్టంగా మారే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు.

వైసీపీ పాలనలో అణగారిన వర్గాలకు అన్యాయం

రామాంజనేయులు

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అణగారిన వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఏపీ చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు ఆరోపించారు. స్థానిక నీలం రాజశేఖర రెడ్డి భవన్‌లో ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తి దారుల సమాఖ్య జిల్లా స్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. సమాఖ్య జిల్లా కార్యదర్శి హరి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన రామాంజనేయులు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ , మైనార్టీల కార్పొరేషన్లకు నిధులు విడుదల చేయకుండా సీఎం జగన్ నిరంకుశత్వాన్ని ప్రదర్శిస్తున్నాడని, దీంతో బడుగు వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారని అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే నిధులు విడుదల చేసి చేతి వృత్తులు, కులవృత్తుల పై ఆధారపడి జీవిస్తున్న పేద ప్రజలకు చేయూతనివ్వాలని డిమాండ్ చేశారు. కానిపక్షంలో చేతి వృత్తి దారుల సమాఖ్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు లింగమయ్య, జిల్లా అధ్యక్షుడు పెనకచర్ల బాలయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బంగారు బాష, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటనారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శి వెంకట్, జిల్లా ఉపాధ్యక్షుడు నాగప్ప, ప్రసాద్, గోవిందు, ఆదినారాయణ, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న క్లాప్ మిత్ర, పారిశుధ్య కార్మికుల కష్టాలు పట్టవా?

వెంకటసుబ్బయ్య

విశాలాంధ్ర-కడప బ్యూరో: జగనన్న క్లాఫ్ మిత్రలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల కష్టాలు తీర్చాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరిం చాలని కోరుతూ కడప కలెక్టర్ కార్యాలయం వద్ద స్వచ్ఛ భారత్ కార్మికుల యూనియన్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరశనలో శనివారం వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు. పెండ్లిమర్రి మండలం టీడీపీ అధ్యక్షులు సంగటి గంగిరెడ్డి సంపూర్ణ మద్దతు ఇచ్చారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీలలో శానిటేషన్ కార్మికులు దుర్వాసనల మధ్య తమ ఆరోగ్యాలను సైతం లెక్కచేయకుండా డ్రైనేజీలు శుభ్రం చేస్తున్న కష్టం చూసైనా పనిచేసిన రోజులకు వేతనాలు ఇవ్వ కుండా నిర్లక్ష్యం చేయడం విచారకరమన్నారు. కార్మికుల ఆందోళనలు చూసైన పాలకులు, అధికారులు స్పందించాలని కోరారు. హరిత రాయబారులుగా ఉన్న కార్మికులను జగనన్న క్లాఫ్ మిత్రులుగా మార్చు కోవడంలో ఉన్న శ్రద్ధ వేతనాలు చెల్లించడంలో ఎందుకు లేదని ప్రశ్నించారు. అరకొర వేతనాలు అందుకుంటున్న చిరు కార్మికులు పది నెలలుగా వేతనాలు అందకపోతే ఏమి తిని బతకాలని, పిల్లల ఆరోగ్యాలకు, చదువులకు, ఆసుపత్రులు ఖర్చులకు అప్పుల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సర్పంచులతో సంబంధం లేకుండా ప్రభుత్వాలే వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జనవరి 9న కలెక్టర్ కార్యాల యం ఎదుట జరిగే ఆందోళనలో జిల్లా వ్యాప్తంగా జగనన్న క్లాఫ్ మిత్ర కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షులు కేసీబాదుల్లా, జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటసుబ్బయ్య, సహాయ కార్యదర్శి అంజనేయులు పాల్గొన్నారు.

మిగులు భూముల పంపిణీ కోసం పోరు

- ఉపాధి పథకాన్ని కాపాడుకోవాలి
- జల్లి విల్సన్, ఆవుల శేఖర్ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: పేదలకు మిగులు భూములు పంచేంత వరకు భూ పోరాటాలు చేద్దామని వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ పిలుపునిచ్చారు. జగనన్న ఇళ్ల కాలనీల లబ్ధిదారులతో కలసి దశల వారీ పోరాటాలకు సిద్ధం కావాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాయల సీమ జిల్లాల సమావేశం అనంతపురంలోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో జిల్లా అధ్యక్షుడు టి.రంగయ్య అధ్యక్షతన శనివారం జరిగింది. ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకుందాం...గ్రామీణ ప్రాంతాల్లో సంఘాన్ని బలోపేతం చేద్దాం నినాదంతో ముం దుకు సాగాలని జల్లి విల్సన్, ఆవుల శేఖర్ పిలుపు నిచ్చారు. నివాసానికి, సాగుకు భూమి లేక గ్రామీణ పేదలు తీవ్ర అవస్థలు పడుతున్నారని, మిగులు భూములు ఉన్నప్పటికీ ప్రభుత్వం పేదలకు పంచ డం లేదని విమర్శించారు. భూ పంపిణీ కోసం పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. బలమున్నోడే ప్రభుత్వ భూములు కబ్జా చేస్తున్నాడన్నారు. ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకోవడానికి ఎప్పటికప్పుడు ఉద్యమాలు చేయాలన్నారు. ఈ పథకంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సవతితల్లి ప్రేమ చూపిస్తున్నా యని మండి పడ్డారు. జగనన్న ఇళ్ల నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇచ్చేంతవరకు పోరాటం ఆగబోదని స్పష్టంచేశారు. నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో తిరగాలని, ప్రజలతో మమేకం కావాలని, కొత్త సభ్యత్వం చేర్పించాలని సూచిం చారు. సమావేశంలో అనంతపురం జిల్లా కార్యదర్శి బి.కేశవరెడ్డి, పెద్దయ్య, కడప జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, పుట్టపర్తి జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, గంగాధర్, కర్నూలు జిల్లా కార్యదర్శి యమ్.నబీరసూల్, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు పండుగొలా మణి, కార్యదర్శి క్రిష్టప్ప, చెన్నయ్య, అనంతపురం జిల్లా నాయకులు నాగమణి, సూర్యనారాయణ, అంజి, నాగరాజు, సంగప్ప పాల్గొన్నారు.

ఉద్యమాలకు సిద్ధం కావాలి

- పాలకుల విధానాలు ఎండగట్టాలి
- ఓబులేసు పిలుపు

విశాలాంధ్ర-కడప రూరల్: కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు కార్మికలోకానికి పిలుపునిచ్చారు. వైఎస్ఆర్ కడప జిల్లా ప్రెస్‌క్లబ్‌లో ఏఐటీయూసీ కడప జిల్లా సమితి సమావేశం జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ అధ్యక్షతన శనివారం జరిగింది. ఓబులేసు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. కార్మికులు, ఉద్యోగులు లేకుండా ఏ దేశం అభివృద్ధి జరగదన్నారు. సంపద సృష్టికర్తలు కార్మికులేనని స్పష్టంచేశారు. కార్మిక సమస్యలపై పాలకులు కనీసం చర్చించడం లేదని, గతంలో బడ్జెట్ సమావేశాలకు ముందు కార్మిక సంఘాలతో చర్చలు జరిపేవారని, ఇప్పుడు ఆ సంప్రదాయానికి తిలోదకాలు ఇచ్చారని మండిపడ్డారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పోరాటాలను అడ్డుకోవడానికి జగన్ సర్కారు కొత్త జీవో తెచ్చిందని విమర్శించారు. అంగన్వాడీ కేంద్రాలకు తెలంగాణ ప్రభుత్వం రూ.13 వేలు ఇస్తుండగా ఏపీ ప్రభుత్వం రూ.11,500 మాత్రమే ఇవ్వడం దారుణమన్నారు. రాష్ట్రంలో 73 షెడ్యూల్ పరిశ్రమల్లో పనిచేస్తున్న 50 లక్షల కార్మికులకు 12 ఏళ్లుగా వేతనం పెరగలేదన్నారు. ఇతర కార్మికసంఘాలను కలుపుకొని రానున్న రోజుల్లో ఉద్యమాలను ఉధృతం చేస్తామని స్పష్టంచేశారు.

ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కోశాధికారి కొండలరావు, సీపీఐ కడప జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, ఏఐటీయూసీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సుహాసిని, ఏపీ అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు ఎస్.మంజుల, ఏఐటీయూసీ కడప జిల్లా డిప్యూటీ సెక్రటరీ కేసీ బాదుల్లా, జిల్లా కార్యదర్శి శ్రీరాములు, ఉద్దె మద్దిలేటి, మస్తాన్, జిల్లా ఉపాధ్యక్షుడు చాంద్‌భాషా, ఏఐటీయూసీ కడప నగర అధ్యక్షుడు పిచ్చినేని సుబ్బారాయుడు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

హరినాథరెడ్డి, లెనిన్

విశాలాంధ్ర - తిరుపతి: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఉపాధి కల్పించక పోవడం వల్ల దేశంలో నిరుద్యోగం రోజురోజుకు పెరిగిపోతోందని యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పన కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి డిమాండ్ చేశారు. ఇక్కడి జీఎస్‌కే భవన్‌లో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు శనివారం జిల్లా అధ్యక్షులు రామకృష్ణ అధ్యక్షతన ప్రారంభమ య్యాయి. ఈ సందర్భంగా హరినాథ రెడ్డి మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేసి నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఈ ఎనిమిది సంవత్సరాలలో 16 వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేద న్నారు. మోదీ విధానాల వల్ల చిన్న పరిశ్రమలు అన్ని మూసివేయడంతో ఉపాధి లేక ఉద్యోగాలు రాక నిరుద్యోగ సమస్య పెరిగిందన్నారు. దేశంలో నైపుణ్యం కలిగిన యువత ఉన్నప్పటికీ వారిని దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించే అవకాశాలున్న యువత పట్ల నిర్లక్ష్యం చేయడం సిగ్గుచేటన్నారు. యువత సమస్యలే ప్రధానంగా కాకుండా ప్రజా సమస్యలను అజెండాగా తీసుకొని అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఉపాధి ఉద్యోగాలు రావాలంటే ప్రత్యేక హోదాతోనే సాధ్యమని చెప్పారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. లెనిన్ బాబు శిక్షణ తరగతుల ప్రారంభం సందర్భంగా ఏఐవైఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, రాష్ట్రంలో యువతకు ఉపాధి ఉద్యోగాలు కావాలంటే ప్రత్యేక హోదాతోనే సాధ్యమవుతుందని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా విభజన హామీలు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 20వ తేదీ హిందూపురం నుంచి ఫిబ్రవరి 4వ తేదీ శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్ లెనిన్ బాబు తెలిపారు. పార్లమెంట్ సాక్షిగా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు, రాష్ట్ర రాజధాని నిర్మాణం, కేంద్రీయ విద్యా, వైద్య సంస్థల నిర్మాణ కోసం నిధులు విడుదల చేయడంలో కేంద్రం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో రెండు లక్షల 35 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉంటే వాటి భర్తీపైన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి స్పందించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి పెంచలయ్య, సీపీఐ నగర కార్యదర్శి జె.విశ్వనాథ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కత్తి రవి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఉదయ్ పాల్గొన్నారు.

అర్చకులకు నూరుశాతం వైద్య ఖర్చులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: దేవదాయ శాఖ పరిధిలోని దేవాలయాలో పనిచేస్తున్న అర్చకులు, వారి కుటుంబ సభ్యులకు ఇకపై వైద్య ఖర్చులు నూరుశాతం చెల్లించనున్నట్లు ఉపముఖ్యమంత్రి, దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. అర్చకులు ఏదైనా కారణం చేత అనారోగ్యం బారిన పడినప్పుడు వైద్యం కోసం చేసిన ఖర్చులో అర్చక సంక్షేమ నిధి నుంచి ఇప్పటివరకు 50శాతం మాత్రమే చెల్లిస్తున్నారు. వారి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని తమ ప్రభుత్వం, ఇనాం భూముల పైన వంతుల వారీగా, ధూప, దీపచ నైవేద్యం పథకం కింద, నెలసరి వేతనంపై పనిచేస్తున్న అర్చకులందరికి ఇకపై నూరుశాతం (100%) వైద్య ఖర్చులు తిరిగి చెల్లింపులు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు. ప్యానల్ డాక్టర్ నిబంధనలు మేరకు సూచించిన మొత్తం ఖర్చును చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇటీవల ప్రారంభించిన అర్చక, ఇతర ఉద్యోగుల సంక్షేమ నిధి ఆన్‌లైన్ వెబ్ సైట్ ద్వారా అర్జీలు నమోదు చేసుకోవచ్చునని మంత్రి వివరించారు.

695వ రోజుకు ఉక్కు దీక్షలు

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ అధ్వర్యాన విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన దీక్షలు 695వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో భాగంగా శనివారం జీవీఎంసీ 86వ వార్డు, కూర్మన్నపాలెందరి, మాతృశ్రీనగర్‌కు చెందిన మహిళలు దీక్షలో పాల్గొన్నారు. వారిని ఉద్దేశించి డీ ఆదినారాయణ, జే అయోధ్యరామ్, ఎన్.రామచంద్రరావు, కేఎస్ఎన్‌రావు, వైటీ దాస్, జే రామకృష్ణ, కారు రమణ, గుమ్మడి నరేంద్ర మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నూటికి నూరు శాతం అమ్మాలని ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. కేంద్రం చర్య సరైనది కాదంటూ మహిళామణులు దీక్షలో కూర్చోవడం సంతోషమన్నారు. చరిత్రలో జరిగిన ఏ ఉద్యమాల్లోనైనా మహిళ పాత్ర ప్రశంసనీయంగానే ఉందని, ఐరన్ లేడీ అని పిలిపించుకున్న ఇందిరా గాంధీ చేతుల మీదగా విశాఖ ఉక్కు శంకుస్థాపన జరిగిందని గుర్తు చేశారు. ఈనెల 30న జరప తలపెట్టిన ఉక్కు ప్రజాగర్జనలో కూడా విశాఖకు ఉద్యోగులు, కార్మికులు, స్థానిక మహిళలు కుటుంబ సభ్యులతో సహా పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ దీక్షల్లో కోనలపాలెం మాతృశ్రీనగర్ లేబెట్ కార్మిక నాయకులు టి.ఎస్.ఎన్, బిఎంఎల్ నాయుడు, విశ్వేశ్వరరావు, కార్మికులు పాల్గొన్నారు.

తెలుగువారు ఉత్తేజితులు కావాలి: వాసిరెడ్డి

ఘనంగా సంక్రాంతి ఆత్మీయ కలయిక

విశాలాంధ్ర-విజయవాడ: గతంలో భారతదేశంలో తెలుగువారికి ఎక్కువ ప్రాధా న్యత ఉండేదని, ప్రస్తుతం అది సన్నగిల్లిం దని తిరిగి తెలుగువారు ఉత్తేజితులు కావాల్సిన అవసరం ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రముఖ సోషలిస్టు నాయకుడు, ప్రజాస్వామికవాది, సమతా పార్టీ జాతీయ మాజీ అధ్యక్షుడు వాసిరెడ్డి వెంకట కృష్ణారావు (వీవీ కృష్ణారావు) నేతృత్వంలో ఏర్పాటు చేసిన 'సంక్రాంతి ఆత్మీయ కలయిక' కార్యక్రమం స్థానిక సిద్ధార్థ అకాడమి ఆడిటోరియంలో శని వారం జరిగింది. ఈ సందర్భంగా వీవీ మాట్లాడుతూ, తెలుగువారు జాతీయ రాజకీ యాల్లో చక్రం తిప్పాలని అభిలషించారు. ఏపీలో విజయవాడ నగరం రాజకీయ చైతన్యం కలిగి ఉండేదన్నారు. స్వాతంత్రోద్యమంలో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు పాల్గొన్నాయని గుర్తు చేశారు. దేశాభివృద్ధికి అవి కీలక పాత్ర పోషించాయని చెప్పారు. తెలుగు వారి కోసం పొట్టిశ్రీరాములు, ఎన్టీఆర్ చేసిన సేవలు మరువలేనివన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పటంలో స్ఫూర్తిగా నిలుస్తారని చెప్పారు. నేటి రాజకీయ పరిస్థితుల్లో తాను తిరిగి ప్రత్యక్ష రాజకీ యాల్లో పాల్గొనాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ, రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ఒకమాట లేనప్పుడు మరో మాట మాట్లాడుతున్నారని చెప్పారు. అధికారాన్ని కాపాడుకునే ప్రయత్నంలో ప్రాంతాల మధ్య తగవులు పెడుతున్నారని ఆరోపించారు. భవిష్యత్ కుర్చీలాటలో నిమగ్నమైన రాజకీయ నాయకులు ప్రజల మధ్య విద్వేషాలు సృష్టిస్తున్నారని, కులాల మధ్య చిచ్చు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధి పట్టించుకోకుండా వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమలో సున్నపు రాయి, రాగి, బంగారం వంటి విలువైన ఖనిజ సంపద ఉందన్నారు. ప్రకృతి వనరులను ఉపయోగించుకుని సంపద సృష్టించాలని సూచించారు. జలవనరుల ప్రాజెక్టులు పూర్తి చేయాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. తప్పు ఎవరు చేసినా ఖండించే చైతన్యం ప్రజల్లో రావాలని కోరారు.

విజయవాడ తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ, కృష్ణా రావు మనస్సులో, మాటలో స్పష్టత ఉంటుంద న్నారు. సీనియర్ ఐపీఎస్ అధికారి ఎ.బి.వెంకటే శ్వరరావు మాట్లాడుతూ, ప్రపంచంలో ఎక్కడ అధునికత ఉన్నా, అభ్యుదయం ఉన్నా దాన్ని పుణికిపుచ్చు కోవటంలో తెలుగువారు ముందుండేవారని చెప్పారు. మాజీ మంత్రి నెట్టెం రఘురామ్, టీడీపీ నాయకులు బచ్చుల అర్జునుడు, టీడీ జనార్ధన్, వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, బీజేపీ రాష్ట్ర మేధావుల సెల్ సభ్యులు హేమలత, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు కె.పోలారి, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర నాయకుడు హరినాథ్, వివిధ ప్రజాసంఘాలు, సామాజిక ఉద్యమ సంఘాల ప్రతినిధులు ప్రసంగించారు. కిషోర్ గోళ్లమూడి, రవితేజ, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతినీ వ్యాపారసంస్థలా మారుస్తారా?

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మూడున్నరేళ్లుగా బాదుడేబాదుడు అంటూ పన్నులు పెంచి ప్రజలపై మోయలేని భారాలను మోపిన జగన్ ప్రభుత్వం, ఇప్పుడు తిరుమలను కూడా వ్యాపారసంస్థగా మార్చి భక్తులకు భగవంతుడిని దూరం చేయాలనుకుంటున్నారా ? అంటూ టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కళా వెంకట్రావు శనివారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుమలలో వెంకటేశ్వరస్వామి భక్తుల సౌకర్యం కోసం నిర్మించిన వసతి గృహాల రేట్లను భారీగా పెంచి భక్తులపై అధిక భారం మోపడం దారుణమన్నారు. మొన్న లడ్డూ రేట్లు పెంచారు, నిన్న బస్ చార్జీలు పెంచారు, నేడు వసతి రేట్లుపెంచి తిరుమల వెంకన్నను భక్తులకు దూరంచేసే ప్రయత్నం చేస్తున్నారు. రూ.50 నుంచి రూ.200 ఉండే అద్దెగదుల రేట్లను రూ.750 నుంచి రూ.2,300కు పైగా పెంచడం దుర్మార్గమన్నారు. ఇలాంటి చర్యల వల్ల వెంకన్నను దర్శించుకునే కోట్లాది భక్తుల మనసుల్లో అపోహలు, అనుమానాలు కలిగే అవకాశం ఉందన్నారు. కోట్ల ఆదాయం, ఆస్తులను కలిగి ఉన్న టీటీడీ, భక్తులకు సరైన వసతి సౌకర్యాలు కల్పించాల్సి ఉండగా, దానికి విరుద్ధంగా వసతి గృహాలను భక్తులకు అందుబాటులో లేని విధంగా చేయటం శోచనీయమన్నారు. పెంచిన అద్దెగదుల రేట్లను టీటీడీ వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

తిన్నది చాలు...ఇక తప్పుకోండి!

బాలకోటయ్య డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాజుల సొమ్ము రాళ్లపాలు అన్నట్లు ప్రజల సొమ్ము సలహాదారుల పాలుగా మారిందని అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షులు పోతుల బాలకోటయ్య విమర్శించారు. ఏ పనీ లేకుండానే ప్రజా ధనాన్ని తినేందుకు ఆశపడటం సరైనది కాదని, వెంటనే ప్రభుత్వ సలహాదారుల పోస్టులకు రాజీనామా చేయాలని ఆయన శనివారం ఒక ప్రకటనలో సంబం ధిత వ్యక్తులకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రికి సలహాదారులు ఉండటంలో తప్పులేదు కానీ, తన పార్టీ కోసం పనిచేశారన్న కారణంతో సలహాదారుల పోస్టులను ప్రభుత్వం సృష్టించిందని, దానిని ఉపాధి హామీ పథకంగా మార్చిందన్నారు. నీటిపారుదల మంత్రికి ఒకరు, నీటిపారుదల కమిషనర్‌కు మరొకరు, నీటి వనరులకు ఇంకొకరిని సలహాదారులుగా పెట్టిందన్నారు. డీజీపీ చీఫ్‌కి ఇద్దరు, సీఐడీ చీఫ్‌కి ఒకరు, మిడిల్‌ఈస్ట్ దేశాల ప్రత్యేక ప్రతినిధిగా ఇంకొకరు, ఆఖరికి దిల్లీ ఏపీ భవన్‌లోనూ కేబినెట్ ర్యాంకు సలహాదారునిగా ఒకరిని నియమించారని చెప్పారు. రాష్ట్రంలో 56 మందిని సలహాదారులుగా పెట్టి, అలవెన్స్‌లు, వగైరాలతో పాటు నెలకు రూ.3లక్షల చొప్పున ఒక్కొక్కరికి రూ.కోటి 68 లక్షలు అంటే ఏడాదికి రూ.20.16 కోట్లు ఇస్తున్నారన్నారు. వారందరికి ఐదేళ్లలో రూ.100.80లక్షలు ఉచితలబ్ధి చేకూరుతుందని, దేశంలో ఏ రాష్ట్రంలో ఇంతమంది సలహాదారులు లేరని, ఇదంతా ప్రజాధనాన్ని వృధా చేసేందుకే పందారమని విమర్శించారు.

ప్రభుత్వ తుగ్లక్ విధానాలతో సలహాదారులు కూడా భాగం పంచుకోవడం క్షంతవ్యం కాదన్నారు. రాష్ట్రహైకోర్టు సైతం సలహాదారుల నియామకాలపై నిప్పులు చెరిగిందని, రాజ్యాంగ నిబద్ధతను ప్రశ్నించిందని గుర్తుచేశారు. వెంటనే తమ పోస్టులకు రాజీనామా చేసి వ్యక్తిగత గౌరవాన్ని, ప్రజాధనాన్ని కాపాడాలని సలహాదారులకు సూచించారు. అలా చేయకపోతే రాబోవు కాలంలో వీరిని రాష్ట్రానికి పట్టిన చీడగా ప్రజలు భావిస్తారని బాలకోటయ్య హెచ్చరించారు.

గర్భాశయ క్యాన్సర్ నియంత్రణకు చర్యలు: రజని

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: గర్భాశయ క్యాన్సర్‌ను అరికట్టేందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్టు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖామంత్రి విడదల రజని తెలిపారు. శనివారం స్థానిక మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. దేశంలో ఏటా 1.25 లక్షలమంది మహిళలు గర్భాశయ క్యాన్సర్ బారిన పడుతున్నా రని, అందులో 75వేల మంది వరకూ చనిపోతున్నారని, ఈ మహమ్మారిని అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత రాష్ట్రప్రభుత్వం, ఏఏపీఐ సహకారంతో గర్భాశయ క్యాన్సర్‌ను అరికట్టే చర్యల్లో భాగంగా సుమారు 100మంది 9 నుంచి 14 ఏళ్ల వయసు గల విద్యార్థులకు వాక్సిన్ వేస్తామన్నారు. తదుపరి రెండో డోసును ఆరు నెలల తరువాత వేస్తామని తెలిపారు. వీటి విలువ సుమారు రూ. 8వేల వరకూ ఉంటుం దన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకొనే పేద విద్యార్థులకు ఈ వ్యాక్సినేషన్ అందిస్తామన్నారు.

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లిఖార్జున మాట్లాడుతూ గర్భాశయ క్యాన్సర్‌ను నిరోధించడానికి రాష్ట్రప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందన్నారు. ఏఏపీఐ అమెరికా మన జిల్లాలో వాక్సినేషన్‌ను ఉచితంగా అందించడం శుభ పరిణామన్నారు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్‌లో చదువుకొనే ఆడపిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే తల్లిదండ్రులకు వ్యాధిపై, వాక్సినేషన్ పై చైతన్యపరచాలన్నారు. ఏఏపీఐ అధ్యక్షుడు డాక్టర్ రవికొల్లి మాట్లాడుతూ 40 ఏళ్లుగా అమెరికాలో ఉంటూ, డాక్టర్స్ అసోసియేషన్ ద్వారా హెచ్‌పీవీ వాక్సిన్‌ను మొదలు పెట్టామని, ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సహకా రంతో మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆసుపత్రిలో ఈ కార్యక్రమాన్ని మొదలు పెట్టామన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మొద టిగా విద్యార్థులకు వాక్సిన్ వేశారు. అనంతరం మంత్రి జిల్లా కలెక్టర్‌తో కలిసి బ్లడ్ క్యాన్సర్ తో చికిత్స పొందుతున్న కీర్తన అనే చిన్నారిని పరామర్శించారు. ఎంపీ ఎవీవీ సత్యన్నా రాయణ, నగర మేయర్ హరి వెంకట కుమారి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, మహాత్మాగాంధీ కేన్సర్ ఆసుపత్రి & రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ వి.మురళీ కృష్ణ, విద్యార్థులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ ఆయుధాల కేసులో నిందితులకు

ముగిసిన పోలీసు కస్టడీ

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: అక్రమ ఆయుధాల కేసులో నిందితులకు ఏడు రోజుల పోలీసు కస్టడీ ముగిసిందని ఎస్పీ ఫక్కీరప్ప చెప్పారు. తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విచారణలో నింది తుల నుంచి పలు కీలక విషయాలు రాబట్టినట్టు చెప్పారు. ముఠాకు చెందిన ఆరుగురు సభ్యులపై డిసెం బర్ 25, 2022న డి.హీరేహాళ్ పోలీసు స్టేషన్లో 120/22 యు/ఎస్ఈ సీ 120(బీ) ఆర్‌డబ్ల్యు 34 ఐపీసీ, ఎస్ఈ ఎస్ 8(సీ) 20 (బీ సీ) ,ఎన్‌డీపీ రేస్ యాక్టు 1985 ఎస్ఈ సీ25 (1బీ) (ఏ) ఏఆర్ఎంఎస్ యాక్టు 1959 కింద కేసు నమోదు చేశారన్నారు. కర్నాటక రాష్ట్రానికి చెందిన జంషీడ్, ముబారక్, అమీర్ పాషా, గోవాకు చెందిన రియాజ్ షేక్, మధ్యప్రదేశ్‌కు చెందిన రాజ్‌పాల్ సింగ్ జునేజా ఏ చోటు, చూన్నిలాల్ ఏ నన్ను సుతార్ ఆదివాసీలను మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి డిసెంబర్ 31 నుంచి ఈ నెల 7వ తేదీ వరకు పోలీసు కస్టడీకి ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. నిందితులను కస్టడీకి తీసుకుని ఏడు రోజులపాటు విచారించినట్టు వివరించారు. కేసు దర్యాప్తులో భాగంగా కర్నాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గోవా రాష్ట్రాలలో చాలా ప్రదేశాలు సందర్శించి సాక్ష్యాలు సేకరించామన్నారు. మధ్యప్రదేశ్‌లోని బర్వాణి జిల్లా వర్ల తహసీల్ ఉమర్టి గ్రామంలో అక్రమ ఆయుధాలు తయారు చేసే కేంద్రంపై దాడి చేసి తుపాకులు తయారు చేయడానికి ఉపయో గించే యంత్ర పరికరాలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. అక్రమంగా ఆయుధాలు తయారు చేసే తొమ్మిది కేంద్రాలను కూడా గుర్తించినట్టు పేర్కొన్నారు. ఆయుధాలు, గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. దేశంలో చాలా రాష్ట్రాలకు ఆయుధాలు రవాణా చేయడమే కాకుండా మాదకద్రవ్యాలు కూడా విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో తేలిం దన్నారు. విచారణ కొనసాగుతోందని స్పష్టం చేశారు.

ప్రత్యేక బృందాలకు రివార్డు: అత్యంత చాకచక్యంగా అంతర్రాష్ట్ర ఆయుధాల ముఠా సభ్యులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 22 తుపాకులు, 97 తూటాలు, 31 కేజీల గంజాయి, రెండు కార్లు స్వాధీనం చేసుకున్న పోలీసు బృందాలకు డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి రూ.25 వేల రివార్డ్ ప్రకటించారు. నిందితులను అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన కళ్యాణదుర్గం డీఎస్పీ బీ శ్రీనివాసులు, రాయదుర్గం రూరల్ సీఐ యుగంధర్, ఆర్ ఎస్సై రాజశేఖర్ రెడ్డి, డి.హీరేహాల్ ఎస్సై రామకృష్ణారెడ్డి, బొమ్మనహాళ్ ఎస్సై శివ, స్పెషల్ పార్టీ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

సంపాదకీయం

పాదయాత్రల రుతువు

ఇప్పుడు ఎక్కడ చూసినా చేతిలో త్రివర్ణ పతాకం కనిపిస్తోంది. భారత ఐక్యత అన్న నినాదమే వినిపిస్తోంది. అనేక పార్టీలు రాహుల్ గాంధీ అంత సుదీర్ఘమైన పాదయాత్రలు కాకపోయినా పరిమితంగానైనా పాద యాత్రలు కొన సాగిస్తున్నాయి. త్రివర్ణ పతాకం, పాదయాత్ర అధికారం సంపాదించడానికి పెద్ద నిచ్చెన అవుతుందన్న విశ్వాసం అనేకమంది నాయకుల్లో కనిపిస్తోంది. రాహుల్ భారత్ జోడో యాత్ర ముగిసిన తరవాత చేయి చేయి కలుపుదాం అన్న యాత్ర ప్రారంభించడం దాదాపు ఖాయం అయిపోయింది. ఈ యాత్ర కచ్ నుంచి కొహిమా దాకా జనవరి 26 నుంచి 26 మార్చి దాకా సాగుతుంది. ఈ యాత్రలో రాహుల్ గాంధీ పాల్గొంటారో లేదో మాత్రం ఇంకా ఖరారు అయినట్టు లేదు. భారత్ జోడో యాత్ర రాజకీయ యాత్ర కాదంటున్నారు. కానీ ఈ యాత్ర పొడవునా బీజేపీ అనుసరిస్తున్న విద్వేష విధానం ప్రస్తావన ఉంది. పనిలో పనిగా నిరుద్యోగం, ధరల పెరుగుదల లాంటి జనం సమస్యలు కూడా రాహుల్ ప్రస్తావిస్తూనే ఉన్నారు. భారత్ జోడో యాత్రతో రాహుల్ గాంధీ పలుకుబడి మెరుగుపడ్తోందన్న అభిప్రాయం కలుగుతోంది. 2024 సార్వత్రిక ఎన్నికలలో ఈ యాత్ర ఉపయోగపడాలన్న ఆశ కాంగ్రెస్‌లో అంతరాంతరాల్లో ఉండొచ్చు. కానీ బయటకు మాత్రం ఆ ఎన్నికల ప్రస్తావనే తీసుకు రావడం లేదు. రాహుల్‌గాంధీ ప్రజల సమస్యలను లేవనెత్తుతున్నారు కనక ఈ సమస్యల వలయంలో చిక్కుకున్న వారు ఈ యాత్రకు మద్దతు ఇస్తారన్న ఆశ లేకపోలేదు. భారత్ జోడో యాత్ర ద్వారా రాహుల్ గాంధీకి సమకూరుతున్న మద్దతును దృష్టిలో పెట్టుకుని కావచ్చు అన్ని రాజకీయ పార్టీలు పాద యాత్రలు నిర్ణయించాయి. ప్రశాంత్ కిశోర్ అక్టోబర్ రెండున ప్రారంభించిన యాత్ర ద్వారా బిహార్ అంతటా పర్యటిస్తున్నారు. జనతాదళ్(యు) నాయకుడు, ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్, రాష్ట్రీయ జనతాదళ్(ఆర్.జె.డి) నాయకుడు, ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ కూడా యాత్రలకు సమాయత్తం అయ్యారు. బీజేపీ కూడా అదే పంథా అనుసరిస్తోంది. కాంగ్రెస్ సైతం బిహార్‌లో పాదయాత్ర మొదలుపెట్టింది. ఈ యాత్రలు అగ్ర నాయకులు నిర్వహించినా, ప్రాంతీయంగా పలుకుబడి ఉందనుకుంటున్న నాయకులు ప్రారంభించినా అన్నింటిలో ఒక సామాన్య సూత్రం కనిపిస్తోంది. అది త్రివర్ణపతాకం. అన్నా హజారే అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమించినప్పుడూ అందులో త్రివర్ణ పతాకమే కనిపించింది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి చూస్తే ఇటీవలి కాలంలోనే తమ రాజకీయ ప్రయోజనాల కోసమైనా త్రివర్ణ పతాకాన్ని మోయడం ఎక్కువగా కనిపిస్తోంది. మల్లికార్జున్ ఖడ్గే కాంగ్రెస్ అధ్యక్షుడు అయినా అసలు నాయకుడు రాహుల్ గాంధీయేనని రుజువు చేయడానికి కచ్చితమైన ప్రయాస కనిపిస్తోంది. కాంగ్రెస్ నాయకత్వం అంటే సోనియా గాంధీ కుటుంబ నాయకత్వమేనని అడుగడుగునా రుజువు చేస్తూనే ఉన్నారు. దాదాపు 138 ఏళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్‌కు అసలైన నాయకత్వం సోనియా కుటుంబమేనని స్పష్టమైన సంకేతాలు వెలువడుతూనే ఉన్నాయి. 2024 దాకా పాదయాత్రలు కొనసాగే సూచనలే ఉన్నాయి. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పాదయాత్రలు చేయకపోయినా ఈ నెలలోనే 11 రాష్ట్రాలలో పర్యటన చేపట్టారు. ఆయన లక్ష్యమూ 2024 ఎన్నికలే. ఆయన తూర్పు రాష్ట్రాలలో పర్యటిస్తూ 2024 జనవరి ఒకటవ తేదీ కల్లా అయోధ్యలో రామమందిర నిర్మాణం పూర్తి అవుతుందని ప్రకటించారు. అంటే చేసిన వాగ్దానం నెరవేరుస్తున్నామని చెప్పదలచుకున్నారు. ఆ సమయానికల్లా 2024 ఎన్నికలు కనుచూపుమేరలో ఉంటాయి. బీజేపీని అధికారానికి చేరువ చేసిందే రామమందిర ఉద్యమం కనక అమిత్‌షా ప్రకటనకు ప్రాధాన్యం తప్పకుండా ఉంటుంది. ఇది హిందుత్వ రాజకీయాలను మరింత ముందుకు తీసుకెళ్లడానికి ఉద్దేశించిన పథకమేనని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అంతకు ఒక్కరోజు ముందే కాంగ్రెస్ మరిన్ని పాదయాత్రల ప్రస్తావన తీసుకొచ్చింది. రాహుల్ పాదయాత్ర ఈ నెలలో కశ్మీర్‌లో ముగుస్తుంది. ఆ తరవాత హాథ్ జోడోయాత్ర ప్రారంభించాలని కాంగ్రెస్ సంకల్పించింది. కచ్ నుంచి ప్రారంభంకానున్న ఈ యాత్రలో గుజరాత్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, బిహార్, పశ్చిమ బెంగాల్, అస్సాం, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్ రాష్ట్రాలను చుట్టబెడ్తారు. ఈ ఏడాది ఎన్నికలు జరగాల్సిన తొమ్మిది రాష్ట్రాలలో తూర్పున ఉన్న రాష్ట్రాలూ ఉన్నాయి మరి.

ప్రధానంగా 2024 ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే బీజేపీ అగ్ర నాయకుల పర్యటనలు ఖరారు అవుతున్నాయి. బిహార్ నుంచి 40లోకసభ స్థానాలు సంపాదించాలని బీజేపీ దీక్షగా పనిచేస్తోంది. బిహార్‌లో బీజేపీ అధ్యక్షుడు జె.పి.నడ్డా పాదయాత్ర జనవరి 3న మొదలు పెట్టారు. సముద్ర మథనంలో ప్రస్తావనకు వచ్చే మందర పర్వత ప్రాంతం నుంచి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖడ్గే 1200 కిలోమీటర్ల యాత్రకు శ్రీకారం చుట్టారు. నితీశ్ కుమార్ గాంధీజి కర్మభూమి అయిన చంపారన్ నుంచి పాదయాత్ర ప్రారంభించారు. దీనిని సమాధాన్ యాత్ర అంటున్నారు. బిహార్‌లో ప్రస్తుతం ఎన్నికలేమీ లేవు. కానీ నితీశ్ దృష్టికూడా 2024 ఎన్నికల మీదే ఉన్నట్టుంది. నితీశ్ యాత్ర బీజేపీ హిందుత్వను ఎదుర్కోవడానికి ఉద్దేశించింది. తేజస్వీ యాదవ్ సీమాంచల్ నుంచి కోసీ ఆంచల్ దాకా పాదయాత్ర చేయనున్నారు. ఈ ప్రాంతాలలో ముస్లింలు ఎక్కువగా ఉంటారు. మజ్లిస్ నాయకుడు ఈ ప్రాంతంలోనే ముస్లిం ఓట్లలో చీలిక తీసుకు రాగలిగారు. అది పునరావృతం కాకుండా చూడడం తేజస్వీ లక్ష్యంగా కనిపిస్తోంది. బిహార్‌లోనే జె.పి.నడ్డా, మల్లికార్జున్ ఖడ్గే, నితీశ్, తేజస్వీ, ప్రశాంత్ కిశోర్ యాత్రలు కొనసాగిస్తున్నారంటే వారి లక్ష్యం ఏమిటో స్పష్టంఅవుతూనే ఉంది. ఉత్తరప్రదేశ్‌లోనూ సమాజ్‌వాది పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్, బహుజన్ సమాజ్‌పార్టీ నాయకురాలు మాయావతి కూడా పాదయాత్రలు మొదలుపెట్టే అవకాశం లేకపోలేదు. రైతులు, కార్మికుల ప్రస్తావన తీసుకువచ్చి రాహుల్‌గాంధీ వామపక్షాల ఓట్లను కొల్లగొట్టాలని అనుకుంటున్నట్టు ఉంది. కుల సమీకరణలలో ప్రస్తుతం బీజేపీ అగ్రభాగాన ఉంది. దాదాపు 15ఏళ్ల నుంచి కాంగ్రెస్ తన పూర్వవైభవాన్ని సంపాదించడంలో సఫలం కాలేకపోయింది. ఇప్పుడైనా కాంగ్రెస్ కార్యకర్తలను క్రియాశీలం చేయగలుగుతోందో లేదో తెలియదు. సోనియా కుటుంబానికి ఆవల కాంగ్రెస్ నాయకులు తెరమీదకు వచ్చే అవకాశమూ కనిపించడం లేదు. మల్లికార్జున్‌ఖడ్గే కాంగ్రెస్ అధ్యక్షుడు అయినా అసలు నాయకత్వం సోనియా కుటుంబానిదే అని సీనియర్ కాంగ్రెస్ నాయకులే అంగీకరిస్తున్నారు. కాంగ్రెస్ భవిత బాగుంటుందనుకుంటేనే కాంగ్రెస్ కార్యకర్తల్లో చురుకుదనం వస్తుంది. 2019లో కాంగ్రెస్‌కు 12 కోట్ల ఓట్లు వస్తే బీజేపీకి 23 కోట్ల ఓట్లు వచ్చాయి. పది కోట్ల లోటు కాంగ్రెస్ పూడ్చగలుగుతుందా అన్నది శేష ప్రశ్నే. ఏ దృష్టితో చూసినా ఇది పాదయాత్రల రుతువులా కనిపిస్తోంది.

మైక్రోచిప్స్ కొరతతో ఆటోమొబైల్స్ కుదేలు

ఆధునిక ఎలక్ట్రానిక్స్ రంగంలో 'గుండెకాయ' లాంటివి సెమికండక్టర్ మైక్రోచిప్స్. అంతర్జాతీయ స్థాయిలో సెమి కండక్టర్(అర్థవాహకాలు) చిప్స్ తీవ్ర కొరతతో ఆటోమొబైల్ రంగంలో వాహనాలు, ముఖ్యంగా కార్ల ఉత్పత్తి, మార్కెటింగ్, రెవిన్యూ పూర్తిగా పడిపోవడంతో కార్ల కొనుగోలుదారులు ఆరునెలల వరకు వేచిచూడాల్సిన అగత్యం ఏర్పడింది. గత ఏడాది నుంచి మైక్రోచిప్స్ కొరతవల్ల ప్రముఖ ఆపిల్ కంపెనీ 6బిలియన్ డాలర్ల వ్యాపారాన్ని కోల్పోయింది. సెమికండక్టర్ చిప్స్ తయారుచేసే ప్రముఖ కంపెనీలుగా ఇంటెల్, సామ్‌సంగ్, టీయస్‌యంసి-తైవాన్, యస్‌కె హైనిక్స్, మైక్రోన్, క్వాల్కమ్, బ్రాడ్‌కమ్, విడియా, టిఐ, ఇన్ఫినియాన్ లాంటివి పేరుగాంచాయి. గతంతో పోల్చితే ప్రస్తుత ఏడాది ప్రపంచవ్యాప్తంగా దాదాపు 7.1మిలియన్ల వాహనాల ఉత్పత్తి తగ్గవచ్చు. కరోనా విపత్తు, చైనా-అమెరికాల మధ్య వాణిజ్య పోరాటాలు, జపాన్ కంపెనీలో అగ్ని ప్రమాదం, వాతావరణ విపత్తులు కారణంగా వాహనాల ఉత్పత్తి కొంతవరకు క్షీణించింది. సెమికండక్టర్ చిప్స్ కొరతతో ఆటోమొబైల్స్, పర్సనల్ కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు, టెలి కమ్యూనికేషన్లు, వైద్య ఉపకరణాలు, లాప్‌టాప్‌లు, గేమింగ్ పిసీలు, ఐపాడ్స్, టాబ్లెట్ పిసీలు, స్మార్ట్ ఫోన్లు, గృహోపకరణాలు, సెక్యూరిటీ వ్యవస్థలు, రక్షణ వ్యవస్థలు, వీడియోగేమ్స్ లాంటి 169 పరిశ్రమల ఉత్పత్తులు తగ్గిపోయాయి. మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, మహింద్రా అండ్ మహింద్రా లాంటి కంపెనీల కార్లకు గిరాకీ ఉన్నప్పటికీ చిప్స్ కొరతతో కార్ల ఉత్పత్తులు తగ్గాయి.

మారుతీ కంపెనీ కార్లు ఏప్రిల్-2021లో 1,35,879 ఉత్పత్తి కాగా, నవంబర్-2021లో 1,09,722 మాత్రమే ఉత్పత్తి అయ్యాయి. హూండయ్ కంపెనీ కార్లు ఏప్రిల్-2021లో 49,002 తయారు కాగా, నవంబరు 2021లో 37,001 మాత్రమే మార్కెట్‌లోకి వచ్చాయి. హీరో స్కూటర్ల అమ్మకాలు 24శాతం, హోండా అమ్మకాలు 6శాతం క్షీణించాయి. చిప్స్ కొరతతో పాసింజర్ వాహనాల తయారీ 27శాతం క్షీణించింది. ప్రతి సాధారణ కారులో కనీసం 150వరకు మైక్రోచిప్స్, అత్యాధునిక కారులో దాదాపు 1,400ల వరకు మైక్రోచిప్స్ వినియోగిస్తారు. 2022, 2023 వరకు మైక్రోచిప్స్ కొరత ఉండవచ్చని అంచనా. డిసెంబర్ 2020 అమ్మకాలతో పోల్చితే, 2021డిసెంబర్‌లో త్రీవీలర్స్, కమర్షియల్ వాహకాలు, ఇతర వాహన ఉత్పత్తి, అమ్మకాలు క్షీణించాయి. డిసెంబరు 2020లో 18.6 లక్షల వాహనాలు, డిసెంబర్ 2021లో 15.6లక్షలు అమ్ముడయ్యాయి. గత డిసెంబర్‌తో పోల్చితే 2021 డిసెంబర్‌లో త్రీ-వీలర్ వాహనాల అమ్మకాలు 59.5శాతం పెరిగాయి. ట్రాక్టర్ అమ్మకాలు 10.3శాతం తగ్గాయి.

ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్, మైక్రోచిప్స్ అనే సెమికండక్టర్లలో సిలికాన్ లేదా జెర్మేనియంలను వాడుతూ, వాహకత పెంచడానికి డోపింగ్ ప్రక్రియ ద్వారా స్వల్ప వాంఛనీయ మలినాలను కలిపి తయారుచేస్తారు. ప్రపంచదేశాల్లో 51శాతం చిప్స్‌ను తైవాన్‌కు చెందిన టియస్‌యంసి కంపెనీ తయారు చేస్తుంది. అమెరికా, చైనా, దక్షిణ కొరియా, జపాన్, నెదర్లాండ్స్‌లో సెమికండక్టర్ల తయారీ పరిశ్రమలు ఉన్నాయి. ప్రస్తుతం 100శాతం విదేశీ దిగుమతుల మీదనే ఆధారపడిన భారత్‌లో మైక్రోచిప్స్ తయారీని పెంచడానికి రానున్న 2-3 ఏండ్లలో కేంద్ర ప్రభుత్వం 76 వేల కోట్ల నిధితో వివిధ రాయితీలు, ఆర్థిక చేయూత కల్పిస్తోంది. టాటా గ్రూప్, మైక్రోన్, ఇస్రో, డిఆర్‌డిఓ, వివిధ అంకుర సంస్థలు భారత్‌లోనే చిప్స్ తయారీకి కృషి చేస్తున్నాయి. కారు డ్రైవర్లకు చేయూత, భద్రత వ్యవస్థలు, కెమెరాలు, జిపియస్ వ్యవస్థ, వినోద ఉపకరణాలు, ఆటోమెటిక్ డ్రైవింగ్ వ్యవస్థలు, ఎలక్ట్రిక్ ఉపకరణాలు, బ్యాటరీలు, డిస్‌ప్లే, లేజర్ డయోడ్స్, యల్‌ఈడీలు, ఫోటో సెల్స్, ట్రాన్సిస్టర్స్, బ్లూటూత్‌లాంటి వేల ఉపకరణాలలో చిప్స్‌ను వాడతారు. ప్రజారవాణాలో ప్రధానభాగమైన వాహనాల డిమాండ్, సరఫరాల మధ్య అంతరానికి కారణమైన మైక్రోచిప్స్ కొరతను అధిగమించడానికి ఇండియా స్వదేశీ పరిజ్ఞానాన్ని, తగు పరిశ్రమలను నెలకొల్పవలసిన అవసరం ఉంది.

-మధుపాళి

విద్యాలయాలలో కనిపించని సామాజిక సామరస్యం

మా తాతలు నేతులు తాగారు మా మూతులు వాసన చూడండి అన్నట్లు ఉంది ఇప్పుడు మన జాతీయ సేవా పథకం. విద్యార్థులు నిస్వార్థంగా సేవచేస్తే కళాశాల ప్రోగ్రాం ఆఫీసరుకు, అలాగే కళాశాలల్లో విద్యార్థులందరూ కలిసికట్టుగా పనిచేస్తే విశ్వవిద్యాలయ ఎన్‌ఎస్‌ఎస్ అధికారిని రాష్ట్ర, జాతీయ స్థాయిలో అభినందిస్తారు. కేవలం తమ కెరీర్ కోసం ప్రాకులాడేవారు కొందరు. ఖరీదైన అట్టముక్క , చెక్క జ్ఞాపిక, జీవన సాఫల్య పురస్కారాల కోసం, గణతంత్ర, స్వతంత్ర దినోత్సవం రోజు ప్రశంసాపత్రం కోసం ప్రాకులాడేవారు ఎక్కువయ్యారు. వీరికి భిన్నంగా కొంతమంది సమాజ సేవకులు ఎలాంటి గుర్తింపు లేకుండా మెరుగైన పౌరసమాజం కోసం తపిస్తుంటారు. 2015 నాటి ప్యారిస్ ఒప్పందం ప్రకారం అత్యధిక కార్బన్ డై ఆక్సైడ్ విడుదల చేస్తున్న అభివృద్ధి చేస్తున్న పెట్టుబడిదారీ దేశాలు, భారత్ సహా కర్బన ఉద్గారాలు తగ్గించకపోతే, త్వరలో ఈ పెరుగుదల 2 సి చేరుకుంటుందని హెచ్చరిస్తున్నారు. దాని పర్యవసానంగా ఒకవైపు మంచు తుఫానులు, మరో వైపు వేడిగాలులు, అరణ్యాలు తగలబడడంతో అత్యధికంగా అవపాతం ఏర్పడి వాతావరణ సమతుల్యత దెబ్బతిని కరువు కాటకాలు ఉత్పన్నమవుతాయి. ఉష్ణమండల ప్రాంతాల్లో తుఫానులు, అల్పపీడనాలు, మంచు ఫలకాలు కరిగి నదులు ఉప్పొంగి, సముద్ర మట్టాలు పెరిగి జనజీవనం అతలాకుతలమై జీవావరణ వ్యవస్థ దెబ్బతినే ప్రమాదంఉంది. వలసలు, కరువుకాటకాలు, వేలాది వృక్షాలు, జంతువులు భూమిపై కనుమరుగయ్యే ప్రమాదంఉంది. వీటి నివారణకు పర్యావరణవేత్తలు సమాజహితంకోసం నిస్వార్థంగా పనిచేస్తున్న వారిలో మేధాపాట్కర్, గ్రెటా థన్‌బర్గ్, దిశ రవి, ఝూదవ్ పెంగ్‌లను గుర్తించవచ్చు. విద్యార్థుల ప్రప్రథమ కర్తవ్యం విద్యాభ్యాసం. కానీ భావి భారతాన్ని నిర్ణయించాల్సింది యువకులే. ప్రతి దేశ పురోభివృద్ధిలో, ఉద్యమాలలోనూ విద్యార్థులు భాగస్వాములు. వీరు సంఘంలో భాగస్వాములే, సంఘసేవ చేయవలసిన బాధ్యత వారికుంది. విద్యాభ్యాసానికి ఆటంకం లేకుండా సంఘసేవ చేసే అవకాశాలున్నాయి.

ఒక మనిషి మరొక మనిషికి సహకరించడం మానవతా లక్షణం. మనం పదిమందిలో ఉన్నప్పుడు మనవల్ల ఆ పదిమందికీ ప్రయోజనం వుండాలి- లేదా మనవల్ల మరొకరికి మేలు కలగాలి. ఆ విధంగా పరస్పర సహకారంగా, పరోపకారంగా, మంచిగా మెలగటమే సంఘసేవ. డా.డి.ఎస్.కొఠారి(1964-66) నేతృత్వంలోని విద్యా కమీషన్, విద్య అన్ని

దశలలో ఉన్న విద్యార్థులను ఏదో ఒక విధమైన సామాజికసేవతో ముడిపెట్టాలని సిఫారసు చేసింది. ఏప్రిల్ 1967 సంవత్సరంలో రాష్ట్రాల విద్యాశాఖమంత్రి వారి సమావేశంలో దీనిని పరిగణనలోకి తీసుకున్నారు. అయితే అప్పటికే విశ్వవిద్యాలయ దశలో, స్వచ్ఛంద ప్రాతిపదికన ఉనికిలో ఉన్న నేషనల్ క్యాడెట్ కార్ప్స్(ఎన్‌సీసీ) లో చేరడానికి విద్యార్థులను అనుమతించాలని, దీనికి ప్రత్యామ్నాయాన్ని నేషనల్ సర్వీస్ స్కీం(ఎన్‌ఎస్‌ఎస్) అని పిలిచే కొత్త కార్యక్రమం రూపంలో వారికి అందించవచ్చని సిఫార్సు చేశారు. 1969లో సెప్టెంబరులో జరిగిన వైస్‌చాన్సలర్ల సమావేశంలో ఈ సిఫారసు ఆధారంగా, సమస్యలు వివరంగా పరిశీలించడానికి వైస్ చాన్సలర్లతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయవచ్చని సూచించారు. భారత ప్రభుత్వ విద్యపై జాతీయ విధానం ప్రకటనలో పని అనుభవం, జాతీయ సేవ విద్యలో అంతర్భాగంగా ఉండాలని నిర్దేశించబడింది. మే, 1969 సంవత్సరంలో, విద్యా మంత్రిత్వశాఖ, విశ్వవిద్యాలయ గ్రాంట్స్ కమిషన్ ఏర్పాటుచేసిన విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థల విద్యార్థుల ప్రతినిధుల సమావేశం కూడా ఏకగ్రీవంగా జాతీయ సేవ జాతీయ సమైక్యతకు శక్తిమంతమైన సాధనం కాగలదని ప్రకటించింది. పట్టణ విద్యార్థులను గ్రామీణ జీవితానికి పరిచయం చేయడానికి, తద్వారా దేశ పురోభివృద్ధికి, అభ్యున్నతికి, విద్యార్థి సమాజం చేస్తున్న కృషికి చిహ్నంగా ఉంటుందని జాతీయసేవా పథకాన్ని ప్రవేశపెట్టారు. 1969 సెప్టెంబరు 24న అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి డాక్టర్ వి.కె.ఆర్.వి.రావు 37 విశ్వవిద్యాలయాలలో జాతీయ సేవాపథకం(ఎన్‌ఎస్‌ఎస్) కార్యక్రమాన్ని ప్రారంభించి, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఈ పథకం అమలుకు సహాయం, సహకారాన్ని కోరారు.

గత నాలుగు సంవత్సరాలుగా జాతీయ సేవా పథకం కార్యక్రమాలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ మధ్య కాలంలో సేవ తక్కువ ప్రచారం ఎక్కువగా ఉంటున్నది. మానవ సంబంధాలు లేని వారిని ఏరికోరి ప్రోగ్రాం ఆఫీసర్లుగా నియమిస్తున్నారు. ప్రతి విశ్వవిద్యాలయం పరిధిలో కనీసం లక్షమంది విద్యార్థులు ఉంటున్నారు, మారుమూల ఉన్న ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో కనీసం రెండువేలమంది విద్యార్థులు ఉన్నప్పుడు సంవత్సరానికి నాలుగు రోజులు రోజు నాలుగు పనిగంటలు అంటే సుమారు పదహారువేల పనిగంటల సమయంతో ఎన్నో పనులు చేయవచ్చు. ఎన్నో శాశ్వత పథకాలకు రూపకల్పన చేయవచ్చు. ఇరవై సంవత్సరాల క్రిందట జన్మభూమి పథకంలో జరిగిన సేవ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు భాగస్వామ్యం అయ్యారు, కొన్ని సందర్భాలలో మైక్రో లెవెల్‌సర్వే విద్యార్థులతో నిర్వహించారు. జాతీయ సేవ పథకానికి ఎంతో గుర్తింపు ఉండేది. గ్రామాలను దత్తత తీసుకునే వారు, గ్రామాభ్యుదయం, ప్రజల జీవనసరళి, వైవిధ్యత, జాతీయ సమైక్యత భావన విద్యార్థులలో ఉండేది. విశ్వవిద్యాలయాలలో యూత్ అండ్ కల్చరల్ ఫెస్టివల్ జరిగేవి. దేశంలో వివిధ ప్రాంతాల సంస్కృతి, ఆహార అలవాట్లు, ఆచారాలు, కట్టుబాట్లు తెలిసేది. తమలో తాము సామాజిక, పౌర బాధ్యతల భావనను పెంపొందించుకోవడం. వ్యక్తిగత,కమ్యూనిటీ సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలను కనుగొనడంలో వారి జ్ఞానాన్ని ఉపయోగించుకోవడం. కమ్యూనిటీ భాగస్వామ్యాన్ని సమీకరించడంలో నైపుణ్యాలను పొందడం, నాయకత్వ లక్షణాలను, ప్రజాస్వామిక విలువలను పెంచుకోవడం. అత్యవసర పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం, జాతీయ సమైక్యత, సామాజిక సామరస్యాన్ని అభ్యసించడం ప్రధాన లక్ష్యాలుగా పనిచేస్తే ఉత్తమ పౌర సమాజం ఆశించవచ్చు.

ఎం.సురేష్‌బాబు

ఇంగితంలేని పండిత ప్రకాండులు



డాక్టర్ దేవరాజు మహారాజు

పుష్యమిత్రుడి కాలం నుంచి ఆధునిక కాలం దాకా హిందూ పండితులమని అనుకున్నవారంతా బౌద్ధంపై విషం కక్కారు. అభాండాలు వేశారు. అబద్ధాలు సృష్టించి చెప్పారు. అందుకు మనం ఎంత మంది పండితుల ఉదాహరణలైనా ఇవ్వొచ్చు. 'బుద్ధ ధర్మం-హిందూ ధర్మంలోని ఒక శాఖ' అని అన్నారు స్వామి వివేకానంద. మరొక అడుగు ముందుకేసిన డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ బుద్ధుడు హిందువుగా పుట్టాడు. కానీ, హిందూ ధర్మానికి ద్రోహం చేశాడు. ధిక్కరించాడు.' అని అన్నారు. ఇంగ్లీషులో the rebel child of Hinduism అని అన్నారాయన. ఇకపోతే, డా.పి.వి.కానే అనే మేధావి 'బుద్ధుడు హిందువుగానే పుట్టాడు. ఉపనిషత్తుల నుంచి కొన్ని విషయాలు సంగ్రహించి, ఆయన తన శిష్యులకు బోధించాడు తప్పిస్తే, ఆయన స్వంతంగా ప్రపంచానికి చెప్పింది ఏదీ లేదు' అని అన్నారు. వీళ్లంతా హిందూధర్మాన్ని ఉద్ధరించినవారిగా, అత్యున్నత స్థాయికి చెందిన హిందువులుగా పేరు గడించినవారు. అయితే, వీరు చెప్పిన మాటల్లో ఎంత నిజం ఉందో విశ్లేషించుకుందాం!

స్వామి వివేకానంద హిందూ ధర్మ ఔన్నత్యం గురించి ప్రపంచస్థాయిలో ప్రసంగించిన వక్త. హిందూ ధర్మ ప్రచారకుడిగా, హిందూ ధర్మసంస్కర్తగా కూడా పేరుంది. అయితే ఇతను బ్రాహ్మణుడు కాదు. కాయస్థకులస్తుడు. అయినా, తన మనసును, మెదడును బ్రహ్మణీకరించుకున్నాడు. ఇక భారత దేశాధ్యక్ష పదవిని అలంకరించిన ప్రొఫెసర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అందరికీ తెలుసు. అయితే ఆయన ఒక మనువాది అని చాలామందికి తెలియదు. కూతుర్లకు బాల్య వివాహాలు చేయడం, అర్ధాంగికి అక్షరం ముక్క రాకుండా చూడడం, తల్లిని హింసించడం, అనైతికంగా పరాయిస్త్రీలతో గడపడం ఆయనకు ఉన్న లక్షణాలు. ఉద్యోగ జీవితంలోనూ నిజాయితీ లేనివాడు. ఇతరుల థీసిస్‌లు కాపీ కొట్టి ప్రచురించుకున్న ఘనాపాటి. ఇవన్నీ ఎవరోచెపితే నమ్మేవాళ్లం కాదు. కానీ, స్వయంగా ఆయన కొడుకే తండ్రి అనైతిక జీవితం గురించి రాశాడు. ఆయన ఎవరోకాదు. దేశం గర్వించదగ్గ చరిత్రకారుడు డా.సర్వేపల్లి గోపాల్. ఇక పీ.వీ.కానె(1880-1972) గురించి చెప్పుకోవాలంటే ది హిస్టరీ ఆఫ్ ధర్మశాస్త్ర-ధర్మశాస్త్రాల చరిత్ర నాలుగు సంపుటాలు. 6,500 పేజీలు రాసిన రచయిత భారత ప్రభుత్వం నుంచి భారత రత్న(1963) స్వీకరించిన పెద్దమనిషి.

తమ సనాతన వైదిక/బ్రాహ్మణ/హిందూ ధర్మాన్ని ప్రతిష్ఠాపించడానికి గొప్పగొప్ప స్థాయిలో ఉన్నవాళ్లు కూడా తమ ఇంగిత జ్ఞానాన్ని మరిచి అబద్ధాలు చెపుతారని మనం అనుకుంటామా? అనుకోము. కానీ వాళ్లు చెప్పారని రుజువైంది. అసలు బుద్ధుడి కాలానికి హిందూ ధర్మంగానీ, హిందూ మతంగానీ లేనేలేవు. హిందూ అనే పదమే లేదు. ఆ పదం ఎప్పుడు ఎలా ఆవిర్భవించిందో చారిత్రక ఆధారాలు మనకు ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గొప్పవాళ్లు చెప్పారని అబద్ధాలు నమ్ముదామా? లేక చరిత్ర రుజువు చేసిన సత్యాల్ని స్వీకరిద్దామా? విద్య అందరికీ అందుబాటులోకి రాకుండా బ్రాహ్మణవర్గం కట్టుదిట్టం చేసిందని మనకు తెలుసు. కేవలం తమ వర్గంలోని పురుషులకు మాత్రమే అందేవిధంగా చర్యలు చేపట్టింది. తమ వర్గంలోని స్త్రీలను కూడా శూద్రుల స్థాయి లోనే ఉంచింది. అందువల్ల సమాజం మీద సర్వాధికారాలు చేజిక్కించుకున్న విద్యావంతులైన బ్రాహ్మణులు ఆ కాలంలో ఏం చెప్పినా చెల్లింది. ఎన్ని అబద్ధాలు చెప్పినా చెల్లింది. వాళ్లను నిలదీసే వారే లేరు. ఎంత ఉన్నతస్థాయికి చెందిన వారైనా వారు చెప్పిన దాంట్లో నిజమెంత అనేది విశ్లేషించుకునే హక్కు ఇప్పుడు మనకు ఉంది. ఇక్కడ ఏవో కొన్ని పేర్లుచెప్పి, వారి స్థాయి తగ్గించాలని నేను ప్రయత్నించడం లేదు. ఇతరత్రా ఉన్న అన్ని ఆధారాలను పరిగణలోకి తీసుకుని, లోతుగా తరచి చూసి, తెలుసుకున్నది ఏమంటే - బుద్ధుడి కాలానికి హిందూ ధర్మం అనేది లేదు. ఆయన హిందువుగా పట్టడమేమిటి? ఆయన కాలానికి ఉపనిషత్తులు, పురాణాలు ఇంకా రాయలేదు. వాటిలోంచి బుద్ధుడు విషయాలు సంగ్రహించి శిష్యులకు బోధించడమేమిటీ? ఆ మాటలకు అర్థమే లేదు. బుద్ధుడి తర్వాత పదమూడు వందల సంవత్సరాల తర్వాత జరిగిన పరిణామాలను బుద్ధుడికి ఆపాదించడం మేమిటి? అంటగట్టడ మెందుకూ? తప్పు కదా?

> ఇంతకూ హిందూ మతానికి ప్రారంభకులు ఎవరూ? ప్రపంచంలోని మతాలన్నింటికీ ఎవరో ఒక ప్రారంభకుడు ఉన్నాడు. మరి హిందూ మతానికి ఎవరూ లేరెందుకు? బుద్ధుడు, మహావీరుడు, జీసస్, మహ్మద్, గురునానక్‌ల వలే హిందూ మత ప్రారంభకులు ఎవరు? ఎవరైనా పరిశోధించగలరా? శంకర, రామానుజ, మధ్వాచార్యులు హిందూ మత ప్రచారకులేతప్ప, ప్రారంభకులు కాదు. కాలక్రమంలో, కొంతమంది కొన్ని కొన్ని విషయాలు సేకరిస్తూ, జోడిస్తూ హిందూ మతానికి ఒక స్వరూపాన్ని తెచ్చినట్లుగా అనిపిస్తుంది.

బుద్ధుడు సాధారణ శకానికి ముందువాడు(బీసీఈ) బుద్ధుడు తర్వాత సాధారణ శకం ఎనిమిది నుండి పన్నెండవ శతాబ్దాల మధ్య ముస్లింలు భారతదేశానికి వలసవచ్చారు. సింధూ నది దాటి వచ్చారు. వారి పారసీ భాషలో స-పలకదు. వారు దాన్ని హ-గా పలుకుతారు. అందుకని, వారు దాన్ని హిందూనది అన్నారు. 'హిందూ నది దాటి వచ్చాం అని చెప్పారు. హిందూ నదీ పరివాహకప్రాంతంలో నివసించే ప్రజల్ని 'హిందువులు' అని అన్నారు. ఆ విధంగా ఆ పదం వాడుకలోకి వచ్చింది. హిందూపదానికి, మతానికీ అప్పుడు సంబంధమే లేదు. తర్వాత క్రమక్రమంగా వైదికలు ఆ పదాన్ని స్వంతం చేసుకున్నారు. తమకు అనువైన విధంగా వాడుకోవడం ప్రారంభించారు. అనాది కాలం నుంచి తమ హిందూ మతం ఉంది. అని ఒక అబద్ధాన్ని ప్రచారం చేసుకున్నారు. ఈ విషయం పరిగణలోకి తీసుకుంటే మన ఈ పండిత ప్రకాండులు బుద్ధుడి గురించి చెప్పినవన్నీ అబద్ధాలని తేలిపోయింది కదా? ఇంతకూ హిందూ మతానికి ప్రారంభకులు ఎవరూ? ప్రపంచంలోని మతాలన్నింటికీ ఎవరో ఒక ప్రారంభకుడు ఉన్నాడు. మరి హిందూ మతానికి ఎవరూ లేరెందుకు? బుద్ధుడు, మహావీరుడు, జీసస్, మహ్మద్, గురునానక్‌ల వలే హిందూ మత ప్రారంభకులు ఎవరు? ఎవరైనా పరిశోధించగలరా? శంకర, రామానుజ, మధ్వాచార్యులు హిందూ మత ప్రచారకులేతప్ప, ప్రారంభకులు కాదు. కాలక్రమంలో, కొంతమంది కొన్ని కొన్ని విషయాలు సేకరిస్తూ, జోడిస్తూ హిందూ మతానికి ఒక స్వరూపాన్ని తెచ్చినట్లుగా అనిపిస్తుంది.

స్వామి వివేకానందుడు బ్రాహ్మణుడు కాకపోయినా, బ్రాహ్మణవాదాన్ని నెత్తిన మోసిన విధంగానే ఒకప్పుడు నూటఎనిమిది ఉపనిషత్తులు రాసినవారు కూడా బ్రాహ్మణులు కాదు. వాటిని క్షత్రియులు రాశారని తెలుస్తోంది. నిజానికి ఉపనిషత్తులు సాహిత్యంలో ఒక భాగం. వేదాలలో భాగం కాదు. నిజానికి ఉపనిషత్తులు సాహిత్యంలో ఒక భాగం. వేదాలలో భాగం కాదు. బ్రహ్మ గురించి ఆత్మగురించి అవి చర్చించాయి. 'బ్రహ్మం సత్యం. జగత్ మిథ్యం' అన్న శంకరాచార్య ఎంత అజ్ఞానాన్ని పంచాడో, ఆధునిక దృష్టి కోణంలో చూస్తే తెలుస్తుంది. అసలైతే 'జగత్ సత్యం- బ్రహ్మం మిథ్యం అని అనాల్సింది. బుద్ధుడు ఆ మాట అనలేదు కాని ఆయన బోధనల్లోని సారాంశం అదే. ప్రతిదీ మానవుడి కోణంలో సాగాలన్నాడు. దేవుడితో మనకేమిటి సంబంధం? దేవుడి పేరుతో మానవులంతా ఉపవాసాలుండి ఎందుకు శుష్కించి పోవాలి? మానవుణ్ణి సంపూర్ణ మానవుడిగా తీర్చిదిద్దే దిశలో మన పనులు ఉండాలి" అని చెప్పాడు బుద్ధుడు. లేని బ్రహ్మాన్ని సత్యమనడం కనిపిస్తున్న జగత్తును మిథ్య అనడం జ్ఞానమవుతుందా? 108 ఉపనిషత్తులలో 11 మాత్రమే ప్రాచీనమైనవని, మిగతావన్నీ తర్వాతకాలంలో రాయబడ్డాయని - అందులో కొన్ని మాత్రమే ముఖ్యమైనవని మిగిలినవన్నీ ఏ ప్రాధాన్యతా లేనివని డా.బి.ఆర్. అంబేద్కర్ తన పరిశోధనలో తేల్చారు. "ప్రాచీన భారత్: క్రాంతి ఔర్ ప్రతి క్రాంతి" చదివినవారికి అలాగే "బుద్ధ అండ్ హిజ్ ధర్మ" వంటి అంబేద్కర్ రచనలు చదివిన వారికి విషయాలు వివరంగా తెలుస్తాయి. హిందు దేవుళ్లలో క్షత్రియులు ఉన్నారు కానీ, బ్రాహ్మణులు లేరన్నది గమనించాలి. అందువల్ల ఉపనిషత్తుల రచనల్లో క్షత్రియుల పాత్రేఉందన్నది అర్థం చేసుకోవాలి.

ఆత్మ,పరమాత్మ సుడిగుండంలో తిప్పి, మనుషుల్ని విభజించి మూర్ఖులుగా తయారుచేసిన సనాతన/వైదిక/బ్రాహ్మణ/హిందూమతం కావాలా లేక కార్యాచరణ సంబంధం గురించి చెప్పి, సర్వమానవ శ్రేయస్సును, సమానత్వాన్ని కోరి మానవుడు పరిపూర్ణుడు కావాలని ఆకాంక్షించిన బుద్ధుడు/బౌద్ధం కావాలా? ఎవరికి వారే ఆలోచించుకోవాలి! ఒకసారి చిత్రమైన సంఘటన జరిగింది. ఒక హిందూమత ప్రచారకుడు ఒక బౌద్ధభిక్షువుతో చర్చిస్తూ "మీరు మా మనుస్మృతిని ఎందుకు విమర్శిస్తారూ, అందులో కొన్ని మంచి విషయాలు కూడా ఉన్నాయి కదా?" అన్నాడు. అవి ఏవో దయచేసి చూపండి అన్నాడు బౌద్ధ భిక్షువు. హిందూ ప్రచారకుడు అంత పెద్ద గ్రంథంలోంచి మూడు, నాలుగు శ్లోకాలు తీసి చూపాడు. భిక్కు నవ్వి "అయ్యా తట్టెడుపేడలో మూడు నాలుగు వేరుశనగ గింజలు పడ్డాయనుకోండి. మీరు ఆ తట్టెడు పేడ తినగలరా?" అని అడిగాడు. అంతే హిందూ ప్రచారకుడు చటుక్కున లేచి వెళ్లిపోయాడు.

భగవద్గీత, ధమ్మపథాన్ని వక్రీకరించి రాసుకున్న గ్రంథం అని పరిశోధకులు తేల్చారు. ప్రపంచంలో భారతదేశానికి గుర్తింపు హిందూ దేవ దేవతలవల్ల రాలేదు. కేవలం ఒక్క బుద్ధుడివల్లే వచ్చింది. ఇక ఇప్పుడు సత్యాన్వేషణకు కంకణం కట్టుకున్న ఈ తరం దేశ పౌరులు అన్నిటినీ పునఃసమీక్షించుకోవాలి. పున: నిర్వచించుకోవాలి. పున:నిర్మాణానికి పూనుకోవాలి. సత్యమేవ జయతే అని బోర్డు మీద రాసుకోవడం కాదు. సత్యం జయించాలంటే దేశ పౌరులంతా నిజ జీవితంలో ప్రతిక్షణం ఇక ఈ పనిలోనే ఉండాలి! సమయం వచ్చేసింది గనుక, ఇక ఉంటారు కూడా!

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత

వ్యక్తిపై దాడి చేసిన 59 మంది మహిళలపై కేసు

కేరళలోని త్రిస్సూర్‌లో ఘటన

త్రిస్సూర్ : కేరళలోని త్రిస్సూర్ జిల్లాలో సామాజిక మాధ్యమం ద్వారా మరో మహిళ మార్ఫింగ్ చేసిన ఫోటోలను ఉంచావని ఆరోపిస్తూ 59 మంది మహిళలు మూకా ఒక వ్యక్తిపై దాడి చేసింది. నిందితులందరిపై కేసు నమోదు చేసి, 11 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. గురువారం సాయంత్రం షాజీ మరో ఐదుగురితో కలిసి కారులో వెళు తుండగా నిందితులు, ఇక్కడి ఆధ్యాత్మిక తిరోగమన కేంద్రానికి చెందిన భక్తులందరూ షాజీపై దాడి చేశారు. మహిళలు... ఆ వ్యక్తిని కారులో నుంచి బయటకు లాగి, కనికరం లేకుండా దాడి చేసిన వీడియో సామాజిక మాధ్యమాలలో వైరల్‌గా మారింది. కొందరు మహిళలు అతనిపై కర్రలతో దాడి చేయడం కూడా వీడియోలో కనిపించింది. ఇక్కడికి సమీపంలోని మురియాడ్‌కు చెందిన షాజీ గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఆ వ్యక్తి, అతని కుటుంబం ఇటీవల డివైన్ రిట్రీట్ సెంటర్‌తో తమ అనుబంధాన్ని తొలగించుకున్నట్లు వారు తెలిపారు. సెంటర్ క్యాంపస్ వెలుపల సంఘటన జరిగినప్పుడు అతనితో పాటు అతని కుటుంబానికి చెందిన ఐదుగురు కూడా కారులో ఉన్నారు. ఈ దాడిలో వారికి కూడా స్వల్ప గాయాలు కాగా, వాహనం అద్దాలు దెబ్బతిన్నాయి. 'ఆ వ్యక్తి ఫిర్యాదు మేరకు, రిట్రీట్ సెంటర్‌కు సంబంధించిన ఒక మహిళ మార్ఫింగ్ చిత్రాలను అతను ప్రచారం చేశాడని ఆపాదింతో మహిళలు అతనిపై దాడి చేశారు' అని పోలీసులు తెలిపారు. సెక్షన్లు 307, 143, 147, 144, 128 సహ ఐపీసీలోని వివిధ సెక్షన్లు అభియోగాలు మోపారు. నిందితుల్లో ఉన్న 11 మంది మహిళలను ఇప్పటికే రిమాండ్‌కు తరలించి వియ్యూరులోని మహిళా జైలుకు తరలించారు. దర్యాప్తు కొనసాగుతుందని వివరించారు.

ఎయిరిండియా పైలట్, సిబ్బందిపై వేటు

న్యూఢిల్లీ: విమానంలో ఓ మహిళపై ప్రయాణికుడు మూత్ర విసర్జనకు పాల్పడిన అంశంలో విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఎయిరిండియా సీఈఓ క్యాంబెల్ విల్సన్ క్షమాపణలు తెలియజేశారు. అంతేగాక, ఘటన సమయంలో విమానంలో ఉన్న సిబ్బందిపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసి విధుల నుంచి పక్కనబెట్టినట్లు వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 'మా విమానాల్లో కొంతమంది తమ తోటి ప్రయాణికులు చేసిన ఆమోదయోగ్యం కాని చర్యలతో తీవ్రంగా బాధపడ్డ ఘటనలు ఆందోళనకరం. బాధితులు ఎదుర్కొన్న వేదు అనుభవానికి మేం విచారం వ్యక్తం చేస్తూ క్షమాపణలు తెలియజేస్తున్నాం. ఇలాంటి వ్యవహారాల్లో మేం మరింత ఉత్తమంగా స్పందించాల్సింది. అయితే.. నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీసుకునేందుకు మేం కట్టుబడి ఉన్నాం. నవంబరు 26న చోటుచేసుకున్న ఘటనలో నలుగురు క్యాబిన్ సిబ్బంది, ఒక పైలట్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశాం. దర్యాప్తు ముగిసేంతవరకు వారిని విధుల నుంచి పక్కనబెట్టాం" అని క్యాంబెల్ ఆ ప్రకటనలో వెల్లడించారు. ఈ ఘటనలో ఇంకెవరైనా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న దానిపైనా తమ అంతర్గత కమిటీ దర్యాప్తు చేస్తున్నట్లు క్యాంబెల్ వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా.. విమాన సిబ్బందికి ఎయిర్‌లైన్ విధానాల పట్ల మరింత అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. విమానాల్లో నిబంధనలను ఉల్లంఘించే ప్రయాణికులతో ఎలా వ్యవహరించాలి? ఇలాంటి ఘటనలను ఎలా పరిష్కరించాలన్న దానిపై సిబ్బందికి సూచనలు చేస్తున్నామన్నారు. ఇక, విమానాల్లో 'మద్యం సేవల' విధానాన్ని కూడా సమీక్షిస్తున్నట్లు క్యాంబెల్ చెప్పారు. ఇదిలా ఉండగా.. ఈ ఘటనలో నిందితుడు శంకర్ మిశ్రాను శనివారం ఉదయం ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. ఘటన వెలుగులోకి వచ్చిన తర్వాత నుంచి మిశ్రా అజ్ఞాతంలోకి వెళ్లగా, పోలీసులు విస్తృత గాలింపు చేపట్టి బెంగళూరులో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఢిల్లీకి తరలించారు. ఆతడిని కోర్టులో హాజరుపరిచారు.

ఒక్క రోగికైనా సాయం చేశారా: వరుణ్‌గాంధీ

న్యూఢిల్లీ: అరుదైన వ్యాధులకు రూ.50 లక్షల సాయమందిస్తామన్న పథకం నుంచి ఇప్పటి వరకు ఒక్క రోగి లబ్ధిపొందలేదని బీజేపీ ఎంపీ వరుణ్‌గాంధీ శనివారం విమర్శించారు. ఈ కోవకు చెందిన 432 మంది రోగుల ప్రాణాలు ప్రమాదంలో ఉన్నాయని, అందులో ప్రధానంగా ఆర్నెళ్ల లోపు వయసు పిల్లలు ఎక్కువమంది ఉన్నారని తెలిపారు. చికిత్స కోసం ఎదురుచూస్తూ పది మంది పిల్లలు చనిపోయారని, తక్షణమే రోగులకు రూ.50 లక్షల సాయం అందించాలని కేంద్ర ఆరోగ్యమంత్రి మన్సుఖ్ మాండవీయకు వరుణ్‌గాంధీ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మాండవీయకు వరుణ్‌గాంధీ లేఖ రాశారు. అరుదైన వ్యాధులతో బాధపడుతున్న రోగుల ప్రాణాలు కాపాడటానికి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ 2021 మార్చి 30న నేషనల్ పాలసీ ఫర్ రేర్ డిసీజెస్, 2021 ప్రారంభించినట్లు గుర్తుచేశారు. దీనికి 2022 మేలో సవరణలు చేశారని, అరుదైన వ్యాధులతో బాధపడుతున్న అన్ని వర్గాల రోగులకు రూ.50 లక్షల సాయం అందిస్తారని ప్రకటించారని తెలిపారు. ఈ పథకం ప్రకటించి కొన్ని నెలలు గడిచినా ఇప్పటి వరకు ఒక్క రోగికి కూడా లబ్ధి చేకూర్చలేదని వరుణ్ విమర్శించారు. 422 మంది రోగుల ప్రాణాలు ప్రమాదంలో ఉన్నాయని పేర్కొన్నారు.

పరశునాథ్ పర్వతాల కోసం గిరిజనుల పోరు

రాంచీ: జైనుల ఆధిపత్యం నుంచి పరశునాథ్ పర్వతాలను విముక్తి చేయాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. జార్ఖండ్‌లోని గిరిధ్ జిల్లాలో పరశునాథ్ పర్వతాలు ఉన్నాయి. ఈ పర్వతాలపై జైనుల ఆధిపత్యాన్ని నిరసిస్తూ గిరిజన సంఘాలు జనవరి 10న ఆందోళనకు దిగనున్నాయి. ఈ ప్రాంతం పవిత్ర పర్యాటక కార్యకలాపాలన్ని నిలిపివేస్తూ కేంద్ర ప్రభుత్వం నిన్న నిర్ణయం తీసుకుంది. తమ డిమాండ్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించకపోతే తిరుగుబాటు తప్పదని గిరిజన సంఘాల తీవ్రంగా హెచ్చరించాయి. పరశునాథ్ పర్వత ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా గుర్తిస్తూ 2019లో జార్ఖండ్ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. దీనిని రద్దు చేయాలని దేశవ్యాప్తంగా జైనులు డిమాండ్ చేస్తున్నారు. పరశునాథ్ పర్వత ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మారిస్తే...పవిత్రమైన ఈ ప్రాంతంలో మాంసాహారం, మద్యం వినియోగం పెరుగుతుందని జైనులు భయపడుతున్నారు. జైనుల ఆందోళనతో పరశునాథ్ హిల్స్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న జార్ఖండ్ ప్రభుత్వ నిర్ణయాన్ని కేంద్రం నిలిపివేసింది. అయినా జైనుల ఆధిపత్యం నుంచి ఈ ప్రాంతాన్ని రక్షించాలని గిరిజనులు డిమాండ్ చేశారు.

2025 మహాకుంభ మేళాకు 5వేల బస్సులు

లక్నో: ప్రయాగ్‌రాజ్‌లో జరిగే 2025 మహా కుంభ మేళాకు హాజరయ్యే భక్తులప్రయాణాన్ని సులభతరం చేసేందుకు ఉత్తరప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ 5వేల కొత్త బస్సులను నడపనున్నట్లు శనివారం అధికారిక ప్రకటనలో తెలిపింది. కొత్త బస్సుల పై ప్రభుత్వానికి దాదాపు రూ.2వేల కోట్లు ఖర్చు అవుతుందని పేర్కొంది. 2019 నుంచి మహా కుంభ్ మేళా నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయి. 2025లో జరిగే జాతరలో దాదాపు 40 కోట్ల మంది భక్తులు పాల్గొంటారని అంచనా. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆదేశాల మేరకు కొత్త బస్సులను కొనుగోలు చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు రవాణా శాఖ మంత్రి దయాశంకర్‌సింగ్ తెలిపారు. అన్ని రూట్లలో ప్రతి 10 నిమిషాలకు బస్సులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. యూపీఎస్ఆర్టీసీ ఎండీ సంజయ్ కుమార్ మాట్లాడుతూ కార్పొరేషన్ మార్చి 2023 నాటికి 1,575 బస్సులను కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఇందులో 1,200 బస్సులను తక్షణమే నడుపుతామని, మిగిలినవి ఏప్రిల్-మేలో చేర్చబడతాయని ఆయన చెప్పారు. అలాగే ఏప్రిల్ 2023 మార్చి 2024 మధ్య 2వేల బస్సులను, ఏప్రిల్-డిసెంబర్ 2024 మధ్య మరో 1,500 బస్సులను కొనుగోలు చేస్తుందని వివరించారు. ఈ బస్సుల్లో అత్యాధునిక సౌకర్యాలు ఉంటాయన్నారు. కొత్త బస్సుల జోడింపుతో పాత బస్సులను కార్పొరేషన్ రద్దు చేయనున్నది. ప్రస్తుతం 11,200 బస్సులు ఉన్నాయి. 2019లో జరిగిన మహా కుంభ్ మేళాలో 24 కోట్ల మంది భక్తులు పాల్గొన్నారు. రూ.4,200 కోట్లు ఖర్చు చేయగా, 2025లో మతపరమైన సభల కోసం ప్రభుత్వం రూ.6,800 కోట్ల బడ్జెట్‌ను కేటాయించిందని ఓ ప్రకటనలో ప్రభుత్వం తెలిపింది.

కూలుతున్న ఇళ్లు... రోడ్లు

- జోషిమఠ్‌లో కొనసాగుతున్న భూమి క్షీణత
- ప్రభావిత ప్రాంతాలను సందర్శించిన సీఎం ధామి

డెహ్రాడూన్ : జోషిమఠ్‌లో భూమి కుంగిపోవడం కొనసాగుతోంది. శుక్రవారం కూడా ఇళ్లు, రోడ్లు, పొలాలకు పెద్దఎత్తున పగుళ్లు ఏర్పడి చాలా ఇళ్లు కూలిపోయాయి. కొండచరియలు విరిగిపడటంతో భారత్-చైనా సరిహద్దులను కలిపే జోషిమఠ్-మలారి సరిహద్దు రహదారిపై అనేక చోట్ల పగుళ్లు ఏర్పడ్డాయి. బద్రీనాథ్ జాతీయ రహదారిలో ఎక్కువ భాగం కూడా కొండచరియలు విరిగిపడుతున్నాయి. జోషిమఠ్ మున్సిపల్ చైర్మన్ శైలేంద్ర పవార్ మాట్లాడుతూ మార్వాడీ వార్డులో భూమి లోపల నుంచి నీరు లీకేజీ కావడంతో ఇళ్లలో భారీ పగుళ్లు వచ్చాయన్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు జోషిమఠ్‌లో పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అన్ని నిర్మాణ పనులను నిలిపివేసినట్లు జిల్లా మెజిస్ట్రేట్ హిమాన్షు ఖురానా తెలిపారు. జోషిమఠ్‌లోని సింధర్ వార్డులో శుక్రవారం సాయంత్రం ఒక ఆలయం కూలిపోవడంతో పెద్ద విపత్తు సంభవిస్తుందనే భయంతో నివసిస్తున్న నివాసితులను మరింత ఆందోళనకు గురిచేసింది. అదృష్టవశాత్తూ ఆలయం కూలిపోయే సమయానికి లోపల ఎవరూ లేరని, గత 15 రోజులుగా పెద్ద పగుళ్లు ఏర్పడిన తరువాత దానిని వదిలివేయడం జరిగిందని స్థానికులు తెలిపారు. దాదాపు 50 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం చమోలి జిల్లా అధికార యంత్రాంగం ప్రకటన ప్రకారం.. 561 నిర్మాణాలకు గాంధీనగర్ వార్డులో 127, మార్వాడీ వార్డులో 28, లోయర్ బజార్ వార్డులో 24, సింధర్ వార్డులో 52, మనోహర్ బాగ్‌లో 71 వార్డు, సునీల్ వార్డులో, అప్పర్ బజార్ వార్డు 27లో 29, పర్సారిలో 50 పగుళ్లు ఉన్నట్లు నివేదించారు. దీని కారణంగా హోటల్ వ్యూ, మలారి ఇన్ కార్యకలాపాలు తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు విపత్తు నిర్వహణ చట్టం, 2005 ప్రకారం మూసివేయబడ్డాయి. అయితే, గురువారం జోషిమఠ్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని నాలుగు కుటుంబాలు, గురుద్వారా జోషిమఠ్ నుంచి ఒకటి, టూరిస్ట్ హాస్టల్, మనోహర్ బాగ్, ఇతరులతో సహా తొమ్మిది కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. జోషిమఠ్‌కు చెందిన స్థానికులు గురువారం ఉదయం బద్రీనాథ్ హైవేను దిగ్బంధించి, భూసేకరణ విషయాన్ని ప్రభుత్వం, పరిపాలన అత్యవసరంగా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. కాగా ఇప్పటి వరకు మొత్తం 38 కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. ముందుజాగ్రత్త చర్యగా జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్) బృందాలను కూడా ఆ ప్రాంతంలో మోహరించినట్లు చమోలీ చీఫ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (సీడీఓ) లలిత్ నారాయణ్ మిశ్రా శుక్రవారం తెలిపారు. జోషిమఠ్ పట్టణంపై భూమి క్షీణత, ప్రభావం గురించి అధ్యయనం చేయడానికి కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఒక ప్యానెల్‌ను ఏర్పాటు చేసింది.

ప్రతి ఒక్కరినీ రక్షిస్తాం : సీఎం ధామి

రాష్ట్రంలోని జోషిమఠ్‌లో భూమి క్షీణతకు గల కారణాలను శాస్త్రవేత్తలు పరిశీలిస్తున్నారని, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తీసుకెళ్లేలా చూడడమే మొదటి ప్రాధాన్యత అని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి తెలిపారు. సీఎం ధామి పట్టణంలోని ఇళ్లు, ఇతర సంస్థలు, రోడ్లు, పొలాలు భూమి కుంగిపోవడంతో బీటలు వారుతున్న ప్రాంతాల్లో సర్వే నిర్వహించారు. ఇళ్లలో పగుళ్లు రావడంతో నిర్వాసితులైన కుటుంబాలతోనూ ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. అంతకుముందు రోజు ఆయన ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. జోషిమఠ్, నరసింగ్ దేవాలయంలోని మార్వాడీ ప్రాంతాన్ని సర్వే చేసిన తర్వాత ధామి విలేకరులతో మాట్లాడుతూ, జోషిమఠ్ గోడల నీటి ప్రవాహం కారణంగా పగుళ్లు ఏర్పడుతున్నాయని, ప్రతి ఒక్కరినీ సురక్షితంగా రక్షించడానికి ప్రయత్నిస్తున్నామని అన్నారు. 'గౌహతి ఇన్‌స్టిట్యూట్, ఐఐటీ రూర్కీ వంటి వివిధ సంస్థలలోని భూ శాస్త్రవేత్తలు, నిపుణులు భూమి క్షీణతకు అసలు కారణాన్ని కనుగొనడానికి కృషి చేస్తున్నారు. మేము ఇస్రో (భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ)తో కూడా చర్చలు జరుపుతున్నాము. ప్రజలను ఇక్కడి నుంచి తరలించి పునరావాసం కల్పించాలని కూడా ఆలోచిస్తున్నాం. దీనికి సంబంధించిన స్థలాన్ని కూడా గుర్తిస్తున్నాం. ప్రస్తుతానికి ఇది శీతాకాలం. అందువల్ల తక్షణమే పరిష్కరించాల్సిన అంశాలను పరిశీలిస్తున్నాం. అంతేకాకుండా, వర్షాకాలం ప్రారంభానికి ముందు ఇక్కడి ప్రజలను రక్షించడంపై కూడా మేము దృష్టి పెడుతున్నాము' అని ధామి అన్నారు. ప్రతి ఒక్కరినీ సురక్షితంగా తరలించడం ఒక పని అని, అయితే మొదటి మనం కూడా ఇక్కడే స్థిరించబడినందున వివిధ కారణాల వల్ల భవిష్యత్తు కోసం కూడా శాస్త్రీయంగా ఉంచడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ పట్టణం మొత్తం దేశానికి చాలా ముఖ్యమైన ప్రదేశం అని ముఖ్యమంత్రి తెలిపారు. అంతకుముందు రోజు శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మునిగిపోతున్న పట్టణంలో పరిస్థితిని సమీక్షించారు. తర్వాత ధామి విలేకరులతో మాట్లాడుతూ జోషిమఠ్ పట్టణంలో భూమి పగుళ్లు ఏర్పడి, ముంపునకు గురవుతున్న ఇళ్లలో నివసిస్తున్న దాదాపు 600 కుటుంబాలను వెంటనే ఖాళీ చేయించాలని ఆదేశించామని అన్నారు. నిరాశ్రయులైన కుటుంబాలకు అద్దెకు ఉండేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆరు నెలల పాటు నెలకు రూ.4 వేలు అందజేస్తామన్నారు. జోషిమఠ్‌లో పరిస్థితిని పరిష్కరించేందుకు మేము స్వల్ప, దీర్ఘకాలిక ప్రణాళికలను కూడా రూపొందిస్తున్నామని చెప్పారు. గర్వాల్ కమిషనర్ సుశీల్ కుమార్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కార్యదర్శి రంజిత్ కుమార్ సిన్హా, నిపుణుల బృందంతో కలిసి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేందుకు మైదానంలో క్యాంప్ చేస్తున్నారని ధామి తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను త్వరితగతిన తరలించాలని అధికారులకు సూచించారు. అక్కడ వైద్య చికిత్స సౌకర్యాలు అందుబాటులో ఉండాలని, ప్రజలను ఆకాశ మార్గాన తరలించేందుకు కూడా ఏర్పాట్లు చేయాలని ఆయన అన్నారు. తక్షణ కార్యాచరణ ప్రణాళికతో పాటు దీర్ఘకాలిక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని, రెండింటిపై సరైన శ్రద్ధతో పని ప్రారంభించాలని ధామి చెప్పారు. ప్రమాదకర జోన్లు, మురుగు కాలువలు, డ్రైనేజీ శుద్ధిపై పనిని వేగవంతం చేయడానికి విధానాలను సరళీకృతం చేయాలి. 'మన పౌరుల జీవితాలు మాకు చాలా ముఖ్యమైనవి' అని తెలిపారు. జోషిమఠ్‌కు సెక్టార్లు, జోన్లుగా విభజించి తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని, పట్టణంలో విపత్తు నియంత్రణ గదిని కూడా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. బాధిత ప్రజలకు శాశ్వత పునరావాసం కోసం పిప్పల్‌కోటి, గౌచర్ తదితర ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించాలని తెలిపారు.

జోషిమఠ్ ధార్మిక, సాంస్కృతిక ప్రాధాన్యత కలిగిన పట్టణమని, ప్రజల జీవనోపాధిపై ఎలాంటి ప్రభావం పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

కేబినెట్ విస్తరణపై కసరత్తు

- కాంగ్రెస్ అధిష్ఠానంతో సీఎం సుక్కు మంతనాలు
- పెద్దసంఖ్యలో ఆశావహులు

సిమ్లా: హిమాచల్‌ప్రదేశ్‌లో కేబినెట్ విస్తరణ కాంగ్రెస్‌కు కత్తిమీద సాములా మారింది. ప్రాంతం, కులం, మతం, యువత మధ్య సమతుల్యత సాధించడం సవాల్‌గా మారింది. హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రిగా సుఖ్వీందర్‌సింగ్ సుక్కు, ముకేశ్ అగ్నిహోత్రి బాధ్యతలు చేపట్టి నాలుగు వారాలు గడిచినా ఇప్పటి వరకు కాంగ్రెస్ కేబినెట్‌ను విస్తరించలేకపోయింది. తన మద్దతుదారులు, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రతిభాసింగ్ వర్గం నేతలకు కేబినెట్‌లో చోటు కల్పించడంపై సీఎం సుక్కు కసరత్తు చేస్తున్నారు. కేబినెట్ విస్తరణపై అధిష్ఠానంతో చర్చించడానికి సీఎం సుక్కు ఇప్పటికే ఢిల్లీలో మకాం వేశారు. పార్టీ పెద్దలతో మంతనాలు సాగిస్తున్నారు. సుక్కు ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన ఒకటి, రెండు రోజుల తర్వాత కొత్త మంత్రుల పేర్లు ప్రకటించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తం 12 జిల్లాలకుగాను మూడు జిల్లాలకు ఇప్పటికే ప్రాతినిధ్యం లభించింది. అందులో ఒకరు సీఎం సుక్కు, మరొకరు డిప్యూటీ సీఎం అగ్నిహోత్రి, ఇంకొకరు స్పీకర్ భటియాన్ కుల్దీప్ పఠానియా ఉన్నారు. గిరిజన ప్రాంతాలైన లహోల్, స్పితి, కిన్నౌర్ నుంచి ఒక్కొక్కరు చొప్పున కేబినెట్‌లోకి తీసుకోవచ్చని భావిస్తున్నారు. కాంగ్రా, సిమ్లా నుంచి పెద్దసంఖ్యలో ఎమ్మెల్యేలు ఉన్నారు. ఆ ప్రాంతాలకు కేబినెట్‌లో సింహభాగం లభించవచ్చని ఆశిస్తున్నారు. మొత్తం 68 మంది సభ్యులు గల హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీలో కాంగ్రెస్ 40 స్థానాలు గెలిచింది. అధిష్ఠానంతో చర్చించి కేబినెట్ విస్తరణ చేయాలని అనుకుంటున్నారు. ప్రొఫెషనల్స్, యువత, ఇతర అన్ని వర్గాలకు కేబినెట్‌లో ప్రాతినిధ్యం కల్పించాలని కాంగ్రెస్ అధిష్ఠానం కోరుకుంటుంది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రా ప్రజలు తమకు భారీ మెజారిటీ కట్టబెట్టారని, ఆ ప్రజలను గౌరవించాల్సిన అవసరం ఉందని ఆ ప్రాంతంలో పర్యటించిన సమయంలో సీఎం చెప్పారు. రెండు, మూడుసార్లు గెలిచిన ఎమ్మెల్యేలు మంత్రి పదవిని ఆశిస్తున్నారు. సుక్కు ప్రతిభ వర్గాల నేతలు మంత్రి పదవులు కోరుకుంటున్నారు. రెండువర్గాలను ఇబ్బంది పెట్టకుండా మంత్రివర్గ కూర్పులో సమతుల్యత పాటించాలని కాంగ్రెస్ భావిస్తోంది. చాలామంది మాజీమంత్రులు, మాజీ సీఎం వీరభద్రసింగ్ తనయుడు, సీనియర్ ఎమ్మెల్యేలు మంత్రిపదవులు ఆశిస్తున్నారు.

ఏపీపీఎస్సీ స్కాంపై సీబీఐ మరో ఎఫ్ఐఆర్

ఇటానగర్: అరుణాచల్‌ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ)లో జరిగిన 'డబ్బు కొట్టు-ఉద్యోగం పట్టు' స్కాంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) మరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిందని, అధికారికంగా కేసును స్వాధీనం చేసుకున్నట్లు సీనియర్ పోలీసు అధికారి శనివారం తెలిపారు. 2014 నుంచి ఏపీపీఎస్సీ చేపట్టిన అన్ని పరీక్షల్లో జరిగిన అవకతవకలపై సీబీఐ శు క్రవారం ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ సెల్ (ఎస్ఐసి) ఎస్పీ ఆనంద్ మిట్టల్ తెలిపారు. కేసును విచారించిన ఎస్ఐసి 39 ప్రభుత్వ అధికారులతో సహ 46మందిని అరెస్టు చేసింది. '2014 నుంచి ఏపీపీఎస్సీ చేపట్టిన వివిధ పరీక్షలపై ఇప్పటి వరకూ 36 ఫిర్యాదులు అందాయి. అన్ని ఫిర్యాదులను కలిపి ఒక కేసుగా చేసి, దర్యాప్తు ప్రారంభించాం. 46మందిని ఇప్పటి వరకూ అరెస్టు చేశాం' అని మిట్టల్ వివరించారు. ఇటీవల జరిగిన పేపర్ లీకేజితో పాటు, ఈ కేసును ప్రభుత్వం సీబీఐ విచారణకు అప్పగించింది. అయితే ఈ కేసుకు సంబంధించి ఎస్ఐసి ఇప్పటి వరకు ఆరుగురు ఇన్‌స్పెక్టర్లు (సివిల్), అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ)ను అరెస్టు చేసింది. మేఘాలయలోని షిల్లాంగ్‌లో ఉన్న ఈశాన్య పోలీస్ అకాడమీ (ఎన్ఈపీఏ)లో ట్రైనింగ్‌లో ఉన్న ఆరుగురు సబ్ ఇన్‌స్పెక్టర్లను అరెస్టు చేసిందని మిట్టల్ వివరించారు. అలాగే ఈస్ట్ సియాంగ్ జిల్లాలోని పసిఘాట్ పీడబ్ల్యూడీ శాఖలో పనిచేస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్ అయిన మహిళను కూడా శు క్రవారం అరెస్టు చేసినట్లు వివరించారు. ప్రాథమిక విచారణలో అదుపులోకి తీసుకున్న తాకేత్ జెరంగ్ ఈ కేసుకు సంబంధించి నిజాలు చెప్పడం లేదని ఎస్ఐసి భావిస్తోందని ఎస్పీ పేర్కొన్నారు. దీనిపై నిజానిజాలు తేల్చేందుకు నార్కో-అనాలసిస్‌కు అనుమతివ్వాలని కోర్టును కోరనున్నట్లు తెలిపారు.

మమత కొత్త కార్యక్రమంపై

టీఎంసీ-బీజేపీ మాటల యుద్ధం

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, టీఎంసీ చైర్‌పర్సన్ మమతా బెనర్జీ ప్రకటించిన కొత్త కార్యక్రమం 'దీదీర్ సురక్షా కవచ్'పై రాష్ట్రంలోని అధికార తృణమూల్ కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ శనివారం మరోసారి మాటల యుద్ధానికి దిగాయి. మమతా బెనర్జీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల ప్రత్యేకతను చాటేందుకు రాబోయే రెండు నెలల్లో రాష్ట్రంలోని 10 కోట్ల జనాభాను పథకాలకు దాదాపు 3.5 లక్షల మంది పార్టీ కార్యకర్తలు రెండు కోట్ల ఇళ్లను సందర్శించనున్నారు. పార్టీ కార్యకర్తలను పార్టీ 'దీదీర్ దూత్' అంటారు. బెనర్జీని ప్రజలు 'దీదీ' (అక్క) అని సంబోధిస్తారు. పంచాయతీ ఎన్నికలకు ముందు రాష్ట్రంలో జరుగుతున్న ప్రచారంపై బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు దిలీప్ ఘోష్ విలేకరులతో మాట్లాడుతూ, టీఎంసీ నాయకులు తమ చైర్‌పర్సన్‌కు సురక్షా కవచ్ (రక్షణ కవచం) అవసరమని, ప్రభుత్వ ప్రాజెక్టులను ప్రజలకు అందకుండా వారు డబ్బును స్వాహా చేసే వారి దుశ్చర్యలను వివరించవలసి ఉంటుందని ఆరోపించారు. 'ఢిల్లీ దూతలు ఇప్పుడు ప్రతిచోటా... రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని టీఎంసీ కార్యాలయాలు, బ్యాంకులకు చేరుతున్నాయి. సీబీఐ దాడుల భయంతో టీఎంసీ నాయకులు వణుకుతున్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద నిధులు ఎలా ఉపయోగించారో తెలుసుకోవడానికి రాష్ట్రంలోని కేంద్ర బృందాలు ప్రతిచోటా తిరుగుతున్నాయి. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద ఇళ్ల కేటాయింపుల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై రెండు కేంద్ర బృందాలు ఇప్పుడు పశ్చిమ బెంగాల్‌లో ఉన్నాయి' అని అన్నారు. దీనిపై టీఎంసీ రాజ్యసభ ఎంపీ శాంతను సేన్ సమాధానమిస్తూ, రాష్ట్ర ప్రజలు టీఎంసీ చైర్‌పర్సన్ మమతా బెనర్జీతో ఉన్నారని పేర్కొన్నారు. ఆమె అనేక సామాజిక సంక్షేమ ప్రాజెక్టులు, ప్రజలకు సహాయం చేయడానికి చేపట్టిన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. టీఎంసీ నడుపుతున్న ప్రభుత్వం ప్రారంభించిన సంక్షేమ కార్యక్రమాలు బీజేపీని అసూయపడేలా చేసింది. పంచాయతీ ఎన్నికలలో తమ ఓటమి భయపడేసి వారు కల్పితంగా అనుకుంటున్నారు. అందుకే అర్థం లేని వ్యాఖ్యలు చేస్తున్నారు' అని సేన్ అన్నారు. కాగా జనవరి 11 నుంచి టీఎంసీ ప్రచారాన్ని ప్రారంభించనుంది.

వణుకుతున్న ఉత్తరాది

జైపూర్: రాజస్థాన్‌లో చలి వణుకిస్తోంది. గడ్డకట్టే స్థాయికి ఉష్ణోగ్రతలు పడిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే పరిస్థితులు మరికొన్ని రోజులు కొనసాగే అవకాశం ఉందని భారత వాతావరణశాఖ తెలిపింది. శుక్రవారం రాత్రి చురులో 0.0 డిగ్రీ సెల్సియస్‌గా ఉష్ణోగ్రత నమోదు కాగా, పిలానీలో 0.6 డిగ్రీలు నమోదైంది. సికార్‌లో 1.0 డిగ్రీలు, కరౌలిలో 1.2, అంతలో 1.6, బనస్థలిలో 1.7, బికనీర్‌లో 2.0, అల్వార్‌లో 2.4, ధోల్‌పూర్‌లో 2.6, నాగౌర్‌లో 3.3, తోంక్‌లో 3.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వాతావరణశాఖ పేర్కొంది. గడచిన 24 గంటల్లో రాష్ట్ర రాజధాని జైపూర్‌లో కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 19.8 డిగ్రీలుగా, 4.4 డిగ్రీలుగా నమోదయ్యాయని వివరించింది. ఇదిలా ఉంటే, రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతల్లో గణనీయమైన మార్పులు వచ్చే అవకాశం ఉందని, చల్లటి గాలులు, మంచు నుంచి ఉపశమనం పొందే అవకాశం ఉందని వాతావరణశాఖ పేర్కొంది.

ఢిల్లీలో 2.2 డిగ్రీల ఉష్ణోగ్రత

న్యూఢిల్లీ: ఈ చలికాలంలో ఢిల్లీలో ఇప్పటి వరకు నమోదైన ఉష్ణోగ్రతల కన్నా, శుక్రవారం నమోదైన ఉష్ణోగ్రత అత్యల్పమని, 2.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని భారత వాతావరణశాఖ పేర్కొంది. పాలెం చుట్టుపక్కల ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు వీడి పరిసరాలు కనబడుతున్నాయి. అయితే దేశీయ, రైల్ ట్రాఫిక్‌కు మాత్రం అంతరాయం తప్పడం లేదు. పొగమంచు ఎక్కువగా ఉన్నందును 36 రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా నడుస్తున్నాయని రైల్వేశాఖ అధికారప్రతినిధి ఒకరు తెలిపారు. గాలిలో తేమ ఉదయం 8.30 గంటలకు 100శాతం నమోదైనట్లు వాతావరణశాఖ తెలిపింది.

హర్యానా, పంజాబ్‌లో కొనసాగుతున్న చలి తీవ్రత

చండీగఢ్: హర్యానా, పంజాబ్‌లలో ఉష్ణోగ్రత పరిస్థితుల్లో ఎలాంటి మార్పు రాలేదు. చలితీవ్రత కొనసాగుతూనే ఉంది. రెండు రాష్ట్రాల్లో దట్టమైన పొగమంచు కురుస్తూనే ఉంది. వాతావరణశాఖ నివేదిక ప్రకారం.. హర్యానాలోని నార్నౌల్, హిసార్‌లలో 2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు పేర్కొంది. సిర్సాలో 3.2 డిగ్రీలు, భివానీలో 5.2, రోహ్‌తక్‌లో 4.4, కర్నల్‌లో 4.5, అంబాలలో 5.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పంజాబ్, భటిండా, గుర్దాస్‌పూర్‌లలో 4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. లుథియానాలో 6.3, పటియాలలో 4.6, అమృతసర్‌లో 6.6, మోహాలిలో 6.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గడచిన కొద్ది రోజులుగా హర్యానా, పంజాబ్ గరిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా గణనీయంగా పడిపోతున్నాయి. 11 నుంచి 15 డిగ్రీల సెల్సియస్‌గా నమోదవుతున్నాయి.

ఊపిరి పీల్చుకుంటున్న జమ్ముకశ్మీర్

కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతుండటంతో జమ్ముకశ్మీర్ ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకుంటున్నారు. శ్రీనగర్‌లో శుక్రవారం రాత్రి మైనస్ 1.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవగా, అర్ధరాత్రి అది 5.5 డిగ్రీలకు చేరుకున్నట్లు వాతావరణశాఖ తెలిపింది. కశ్మీర్ లోయను ప్రధాన ద్వారమైన ఖ్వాజిగుండ్‌లో అత్యల్ప ఉష్ణోగ్రత మైనస్ 1.6 డిగ్రీలుగా ఉండగా, కుప్వారాలో మైనస్ 1.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కొకెర్‌నాగ్‌లో మైనస్ 1.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అమర్‌నాథ్ యాత్రకు బేస్ క్యాంప్ అయిన అనంతనాగ్ జిల్లాలోని పెహల్‌గామ్‌లో మైనస్ 2.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గుల్మార్గ్‌లో మైనస్ 2.6, డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అయితే శనివారం మంచు తక్కువ శాతం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. జనవరి 10, 11 తేదీల్లో వాతావరణం సాధారణంగా మేఘావృతమై ఉంటుందనీ, జమ్ము పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా ఒక మోస్తరు హిమపాతం, వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయని, ఎత్తైన ప్రాంతాలలో భారీ హిమపాతం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. కశ్మీర్ ప్రస్తుతం 'చిల్లా-ఇ-కలన్' ఆధీనంలో ఉంది. ఇది 40-రోజుల అత్యంత కఠినమైన వాతావరణ కాలం. ఈ సమయంలో హిమపాతం అవకాశాలు గరిష్ఠంగా ఉంటాయి. 'చిల్లా-ఇ-కలన్' డిసెంబర్ 21న ప్రారంభమై జనవరి 30న ముగుస్తుంది. ఆ తర్వాత 20 రోజుల పాటు కొనసాగే 'చిల్లా-ఇ-ఖుర్ద్' 10 రోజుల పాటు వచ్చే 'చిల్లా-ఇ-బచ్చా' తర్వాత కూడా చలి గాలులు కొనసాగుతాయి.

ఎన్నికల బాండ్ల ద్వారానే టీఎంసీకి 96శాతం ఆదాయం

న్యూఢిల్లీ: తృణమూల్ కాంగ్రెస్‌కు 2021-22లో 96 శాతం ఆదాయం ఎన్నికల బాండ్ల రూపంలోనే వచ్చాయని పార్టీ సంవత్సరాంత ఆడిట్ నివేదిక తెలిపింది. 2020-21లో రూ.42 కోట్ల ఆదాయం ఎన్నికల బాండ్ల రూపంలో రాగా, 2021-22లో ఆ ఆదాయం రూ.528.14 కోట్లకు పెరిగిందని నివేదిక తెలిపింది. ఎన్నికల బాండ్లు అనేవి రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చేందుకు ఆర్థికసాధనంగా ఉపయోగిస్తున్నారు. శుక్రవారం విడుదల చేసిన నివేదిక ఆధారంగా 2021-22లో తృణమూల్ కాంగ్రెస్‌కు వచ్చిన మొత్తం ఆదాయం రూ.545.74 కోట్లు కాగా, అందులో రూ.528.14 క ఓట్ల ఎన్నికల బాండ్ల రూపంలోనే వచ్చాయి. పార్టీ ప్రాథమిక సభ్యత్వం / ఫీజు / సబ్‌స్క్రిప్షన్ / చందాల రూపంలో రూ.14.36 కోట్లు వచ్చినట్లు తెలిపింది.

2021 పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో పార్టీ విజయం సాధించిన తరువాత ఖర్చు కూడా పెరిగినట్లు తెలిపింది. 2020-21లో పార్టీ ఖర్చు రూ.132.52 కోట్లు కాగా, 2021-2022లో అది రూ.268.33 కోట్లకు పెరిగింది. ఈ నివేదికను తృణమూల్ కాంగ్రెస్ ఎన్నికల సంఘానికి సమర్పించనున్నది.

సర్కారుపై తిరుగుబాటు తప్పదు

- ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేస్తారా?
- జీవో రద్దు చేసే వరకు పోరాటం: ఓబులేసు
- సంకెళ్లతో అఖిలపక్ష నేతల వినూత్న నిరసన

విశాలాంధ్ర బ్యూరో–కడప: పౌర హక్కులకు భంగం కలిగిస్తూ... రాజ్యాంగ హక్కులు కాల రాస్తే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవని, ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేస్తే ప్రజలు తిరగబడతారని అఖిలపక్ష నాయకులు హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవో నంబరు 1 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కడప అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం జరిగిన ఆందోళనలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు, జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్, అమీర్ బాబు, లక్ష్మిరెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఎస్ఏ సత్తార్, సీపీయం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సీఆర్‌వీ ప్రసాద్, రాము, బీఎస్పీ నాయకులు గుర్రప్ప, లోక్‌సత్తా నాయకులు కృష్ణా, జనతాదళ్ రాష్ట్ర నాయకులు ప్రతాపరెడ్డి, సీపీఐ (ఎంఎల్ లిబరేషన్) జిల్లా కార్యదర్శి జి.రమణయ్య, ఎస్సీ, ఎస్టీ మానవ హక్కుల నాయకులు జేవీ రమణ, ఎంఆర్‌ఎఫ్ దస్తగిరి పాల్గొన్నారు. ఓబులేసు మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చేందుకు పాదయాత్రలు, ఓదార్పు యాత్రలు, రోడ్ షోలు, రోడ్లపై సభలు, సమావేశాలు, దీక్షలు నిర్వహించవచ్చు కానీ...ప్రతిపక్షాలు, ప్రజలు చేయకూడదా అని ప్రశ్నించారు. రాజ్యాంగం జగన్ ఒక్కడికే హక్కులు కల్పించలేదని చెప్పారు. జగన్ ప్రభుత్వం ఐఏఎస్ అధికారులను పక్కనపెట్టి...వందల మందిని సలహా దారులుగా నియమించుకొని పరిపాలన సాగిస్తోందని విమర్శించారు. జగన్ హయాంలో మైన్, వైన్, ల్యాండ్, శాండ్ మాఫియా యథేచ్ఛగా దోపిడీ చేస్తోందన్నారు. ప్రత్యేక హోదా, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ రాబట్టడంలో జగన్ సర్కారు ఘోరంగా విఫలమైందని నిందించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. వైఎస్సార్ జలకళ పథకం కింద ఉచిత బోర్లు వేయించకపోగా...వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టడాన్ని తప్పుబట్టారు. జగన్ వైఫల్యాలపై ఆందోళనలు, ఉద్యమాలు, నిరసనలు తెలపకుండా జీవో 1 తీసుకొచ్చారని విమర్శించారు. ఈ జీవో రాజ్యాంగ విరుద్ధమని, వెంటనే దీనిని వెనక్కి తీసుకోవాలన్నారు. జీవో నంబర్ 1 రద్దు కోరుతూ కడపలోని అంబేద్కర్ కూడలిలో చేతికి సంకెళ్లతో నిరసన తెలిపారు. సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు కె.ఆంజనేయులు, పి.కృష్ణమూర్తి, పి.చంద్రశేఖర్, ఎన్.వెంకటశివ, సి.బషీరున్నీసా, ఎన్.విజయలక్ష్మి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జి.వేణుగోపాల్, టీడీపీ నగర నాయకులు హరి, ఎంపీ సురేశ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వలరాజు, నగర కార్యదర్శి వలసగాండ్ల సుబ్బరాయుడు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మునయ్య, పుష్పరాజ్, ఆర్.బాబు, ఏఐవైఎఫ్ నేత నాగేంద్ర, చేతివృత్తిదారుల సంఘం ఉపాధ్యక్షులు వి.భాగ్యలక్ష్మి, భీమరాజు, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బ్రహ్మం, కార్యదర్శి శంకర్ నాయక్, మహిళా సంఘం నేతలు సుబ్బమ్మ, పద్మ, లక్ష్మీదేవి, రైతుసంఘం నేత బాలచంద్రయ్య, జయన్న, రామోహన్‌రెడ్డి, నారాయణ, మల్లికార్జున, కొండయ్య, పక్కీరప్ప, ఎస్‌ఎఫ్ఐ నగర కార్యదర్శి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

దివాలా దిశగా ఏపీ

- ఫిబ్రవరి, మార్చి జీతాలు, పెన్షన్లపై ఉద్యోగుల్లో ఆందోళన
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేయడంతో ఏపీ పరిస్థితి దివాలా దిశగా పయనిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి, మార్చి నెలలకు జీతాలుంటాయో లేదోనని, పెన్షన్ల చెల్లింపు కూడా జరగడం కూడా ప్రశ్నార్థకమన్నట్లుగా ఉండడంతో ఉద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి 'అప్పులు తేవడంపై ఉన్న శ్రద్ధ, అభివృద్ధిపై చూపలేదు. ఏపీ అప్పులు ఇప్పటికే రూ.8 లక్షల కోట్లకు చేరినట్లు ఆర్థిక వేత్తలు చెబుతున్నారు. ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేసి, కొంతవరకు సంక్షేమ పథకాలకు వెచ్చిస్తున్నారేతప్ప, అభివృద్ధిపై దృష్టి పెట్టడం లేదు. రాష్ట్రంలో పారిశ్రామిక, వ్యవసాయ రంగాలు పూర్తిగా కుదేలయ్యాయి. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించక పోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం మరో రూ.4,557 కోట్ల కొత్త అప్పుకు కేంద్రం అనుమతిచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరం చివరి మూడు నెలలైన జనవరి నుంచి మార్చి వరకు రూ.21 వేల కోట్లు కావాలని ఏపీ ప్రభుత్వం కేంద్ర ఆర్థిక శాఖ దృష్టికి తీసుకెళ్లింది. కేంద్రం మాత్రం రూ.4,557 కోట్ల రుణాలకు మాత్రమే అనుమతినిచ్చింది. ప్రస్తుత రుణాలతో కలిపి ఈ ఆర్థిక సంవత్సరంలో ఏపీకి మొత్తం రూ.49,860 కోట్ల రుణాలకు కేంద్రం అనుమతులిచ్చింది. ఆ రుణాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.45,303 కోట్లను వినియోగించుకోవడం గమనార్హం. ఈ పరిస్థితుల్లో ఫిబ్రవరి, మార్చి నెలలకుగాను ఉద్యోగస్తులకు జీతాలు చెల్లిస్తారో లేదోనన్న ప్రశ్న ఉద్యోగస్తుల్లో ఉత్పన్నమవుతోంది. ప్రతి నెలా ఇచ్చే పెన్షన్‌లు కూడా సకాలంలో ఇస్తారా లేదా? అనే సందేహం కలుగుతోంది. ఇప్పటికే జనవరి నెల జీతాల చెల్లింపులు ఆలస్యమై ఉద్యోగుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. ఈ జనవరి నుంచి పెన్షన్ రూ.250 పెంచి రూ.2,750 ఇస్తున్నామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక భారం తగ్గించుకునేందుకు కుంటిసాకులతో లబ్ధిదారులను తొలగిస్తున్నారు. అందినకాడికి అప్పులు చేయడం, కేంద్రం విధించే విషమ షరతులకు తలొగ్గి ప్రజలపై ఎడాపెడా పన్నులు వేయడమే పనిగా పాలన సాగిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఏపీ ఖజానాకు ఆర్థిక ఇబ్బందులు తప్పవని రామకృష్ణ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

భారత్ సాఫ్ట్‌వేర్ ఉత్పత్తుల హబ్ కావాలి: ముర్ము

న్యూదిల్లీ: భారతదేశం సాఫ్ట్‌వేర్ రంగంలో దూసుకెళుతోందని, ఇక స్టాఫ్ట్‌వేర్ ఉత్పత్తుల హబ్‌గా ఎదగాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఆమె శనివారం డిజిటల్ ఇండియా అవార్డుల ఏడవ ఎడిషన్‌లో మాట్లాడారు. దేశీయంగా డిజిటల్ పరిష్కారాలాభివృద్ధికిగాను ఔత్సాహిక సాంకేతిక నిపుణులకు సహకరించేందుకు ప్రభుత్వ డేటా ప్రజాస్వామీకరణపై దృష్టి పెట్టడం అవసరమని ఆమె నొక్కిచెప్పారు. స్టాఫ్ట్‌వేర్–హార్డ్‌వేర్ ఉత్పత్తులను దేశీయ పరిజ్ఞానంతో తయారు చేసుకుంటూ గ్లోబల్ పవర్‌హౌస్‌గా అంత ర్జాతీయ స్థాయిలో తన స్థానాన్ని భారత్ నిర్దేశించుకోవాలని ముర్ము అన్నారు. అంతర్జాతీయంగా దేశ ప్రతిష్ఠను పెంచడంలో డిజిటల్ ఇండియా పాత్ర కీలకమన్నారు. జీ20 అధ్యక్షతను భారత్ చేపట్టడం ఘనతగా ముర్ము చెప్పారు.

ఎంఎస్పీ... సేకరణ ధర కారాదు

- నేటికీ అసంపూర్తిగానే వ్యవసాయ రంగ సంస్కరణలు
- ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మన్ దేబ్రాయ్

న్యూదిల్లీ: కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) సేకరణ ధరగా ఉండ కూడదని, వ్యవసాయ రంగ సంస్కరణలు నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మన్ వివేక్ దేబ్రాయ్ అన్నారు. ప్రస్తుతానికి ఎంఎస్పీ... సేకరణ (ప్రొక్యూర్‌మెంట్) ధరకు సమానంగానే ఉన్నదన్నారు. 'టర్బో చార్జింగ్ ది అగ్రి–బిజ్ అండ్ కమోడిటీస్ సెక్టార్' అంశంపై బిజినెస్ లైన్ అగ్రి–బిజినెస్ అండ్ కమోడిటీస్ సమ్మిట్‌లో మాట్లాడుతూ సేకరణ విధానాన్ని రూపొందించుకున్న రోజు మార్పుకు ఆస్కారం ఉండబోదని వివేక్ దేబ్రాయ్ నొక్కిచెప్పారు. రైతులు ఎంట్రప్రెన్యూర్‌లుగా సరిపోరా? అని మనకు మనమే ప్రశ్నించుకోవాలని సూచించారు. ఎంట్రప్రెన్యూర్ అంటే సవాళ్లను ఎదుర్కొనే వారు. కార్పొరేట్‌ల కంటే సమర్థ ఎంట్రప్రెన్యూర్స్ రైతులే అవతారు.. ఎందుకంటే వారే ఎక్కువ అన్ని వేళలా రిస్క్ తీసుకుంటారన్నారు. రైతుల విషయంలో జోక్యం ఉండకూడదని, అది జరిగినప్పుడే భారతీయ వ్యవసాయం రంగంలో మార్పు రాగలదని అభిప్రాయపడ్డారు. ఆధునిక భూ విధానాలు, ఆధునిక భూ రికార్డులు ఉంటే తప్ప వ్యవసాయ సంస్కరణకు తావులేదన్నారు. '1978–78లో చైనాలో మొదటగా వ్యవసాయ సంస్కరణలు జరిగాయి. 1991లో భారత్‌లో సంస్కరణలు మొదలైనట్లు చెబుతుంటారు. బాహ్య రంగం– పారిశ్రామిక డీలైసెన్సింగ్‌కు సంబంధించి సంస్కరణలు జరిగాయి. వ్యవసాయంలో సంస్కరణలు మొదలైనా వాటిని డీలైసెన్సింగ్ చేశారా అంటే సమాధానం లేద'ని దేబ్రాయ్ తెలిపారు. ఇన్‌పుట్–అవుట్‌పుట్–మార్కెటింగ్‌పై నియంత్రణ ఉండటాన్ని బట్టి 1991 నుంచి నేటి వరకు వ్యవసాయ రంగంలో సంస్కరణలు పెండింగ్‌లోనే ఉన్నాయని దేబ్రాయ్ నొక్కిచెప్పారు.

భారత్ జోడో... ఎన్నికల యాత్ర కాదు

రాహుల్ ప్రచార యాత్ర అంతకంటే కాదు: జైరాం రమేశ్

కర్నాల్: హరియాణాలో భారత్ జోడో యాత్ర కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో హుషారుగా సాగుతోంది. శనివారం కర్నాల్‌లోకి ప్రవేశించింది. ప్రముఖ బాక్సర్ విజేంద్ర సింగ్, కాంగ్రెస్ సీనియర్ నేతలు భూపిందర్ సింగ్ హుడా, రణదీప్ సింగ్ సూర్జేవాలా పాల్గొన్నారు. ఆదివారం ఉదయం కురుక్షేత్ర జిల్లాలోకి యాత్ర ప్రవేశిస్తుంది. భారత్ జోడో యాత్ర ఎన్నికల యాత్ర, రాహుల్ గాంధీ కోసం జరిగే ప్రచార యాత్ర కాబోదని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విలేకరుల సమావేశంలో స్పష్టంచేశారు. 2024 ఎన్నికల ఉద్దేశంతో చేపట్టినది కాదని చెప్పారు. రాహుల్‌ను ప్రధాని అభ్యర్థిగా చూపే ప్రయత్నం జరగడంలేదన్నారు. యాత్రలో రాహుల్ 'ఆర్థిక అసమానత, సామాజిక విభజన, రాజకీయ నిరంకుశత్వం' అంశాలపైనే దృష్టి పెట్టినట్లు తెలిపారు. ప్రజాసమస్యలను తెలుసుకుంటూ ముందుకెళుతున్నట్లు చెప్పారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రధానమంత్రి అభ్యర్థిగా రాహుల్ గాంధీకి ప్రచారం జరుగుతోందా అని ప్రతిపక్ష పార్టీని అడగడం అన్యాయమని ఓ ప్రశ్నకు జైరాం రమేశ్ బదులిచ్చారు. 200 మంది యాత్రికులు కాంగ్రెస్ కార్యకర్తలేనని చెప్పారు. 'ప్రస్తుతం అందరి దృష్టిని రాహుల్‌గాంధీ ఆకర్షిస్తున్నారు. ఈ యాత్రలో ఆయనే డైనమిక్ నేత. ప్రత్యేకించి రాహుల్ కోసమో లేక ఆయనను ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రచారం చేసేందుకో... ఎన్నికల లక్ష్యంతోనో దీనిని చేపట్టలేదు' అని విలేకరుల ప్రశ్నలకు జైరాం రమేశ్ సమాధానాలిచ్చారు. కాంగ్రెస్ సిద్ధాంతాలు, పార్టీ బలోపేతంతో పాటు ప్రధాని మోదీ పనితీరు, వినాశకర విధానాలు, రాజకీయ కక్షసాధింపు వల్ల కలుగుతున్న నష్టం గురించి ప్రజలను చైతన్యపర్చడమే యాత్ర ముఖ్యఉద్దేశంగా తెలిపారు.

బాఫ్టా రేస్‌లో 'ఆర్ఆర్ఆర్'



హైదరాబాద్: దర్శకధీరుడు ఎస్ఎస్. రాజమౌళి తెరకెక్కించిన 'ఆర్ఆర్ఆర్' ఇంటర్నేషనల్ అవార్డ్స్‌లో సత్తా చాటుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే అనేక పురస్కారాలను ఈ చిత్రం గెలుచుకుంది. తాజాగా ఈ చిత్రం అరుదైన ఘనతను సాధించింది. బాఫ్టా (బ్రిటిష్ అకాడమీ ఆఫ్ ఫిలిం అండ్ టెలివిజన్ ఆర్ట్స్) రేసులో నిలిచింది. నాన్ ఇంగ్లిష్ కేటగిరిలో ఉత్తమ చిత్రంగా పోటీ పడనుంది. శౌనక్ సేన్ తెరకెక్కించిన 'ఆల్ దట్ బ్రీత్స్' కూడా ఉత్తమ డాక్యుమెంటరీ కేటగిరిలో బాఫ్టా రేసులో ఉంది. ఈ నేపథ్యంలో ఆర్ఆర్ఆర్ చిత్ర బృందం తమ సంతోషాన్ని సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకుంది. "బాఫ్టా ఫిలిం అవార్డ్స్ లాంగ్ లిస్ట్‌లో 'ఆర్ఆర్ఆర్' చోటు దక్కించుకుందనే విషయాన్ని తెలియజేయడానికి చాలా సంతోషిస్తున్నాం. ఈ ప్రయాణంలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు" అని సోషల్ మీడియాలో 'ఆర్ఆర్ఆర్' బృందం తెలిపింది. బాఫ్టా ఓటింగ్ మెంబర్స్ అందరు ఓటును వేసి నామినేషన్స్, విజేతలను త్వరలోనే నిర్ణయించనున్నారు. బాఫ్టా నామినేషన్స్‌ను జనవరి 19న ప్రకటిస్తారు. విజేతలకు పురస్కారాలను ఫిబ్రవరి 19న అందజేస్తారు. కొన్ని రోజుల క్రితమే ఆర్ఆర్ఆర్ సినిమా గోల్డెన్ గ్లోబ్ నామినేషన్స్‌ను సాధించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రం పురస్కారం కోసం బెస్ట్ ఫిలిం నాన్ ఇంగ్లిష్, బెస్ట్ ఒరిజినల్ సాంగ్ కేటగిరిల్లో పోటీపడుతుంది. లాస్ ఏంజెలెస్‌లో జనవరి 11న ఈ పురస్కారాలను అందజేయనున్నారు. ఆస్కార్ అవార్డ్స్ రేసులోను 'ఆర్ఆర్ఆర్' నిలిచిన సంగతి తెలిసిందే. బెస్ట్ ఒరిజినల్ సాంగ్ కేటగిరి కింద నాటు నాటు పాట ఇప్పటికే అకాడమీ అవార్డ్ కోసం షార్ట్‌లిస్ట్ అయింది. ఆస్కార్స్ నామినేషన్స్‌ను జనవరి 24న ప్రకటిస్తారు.

సెక్యులరిజాన్ని, మానవ హక్కులను రక్షించుకోవాలి

అంతర్జాతీయ నాస్తిక మహాసభలో మానవవాదుల పిలుపు

విశాలాంధ్ర–విజయవాడ: సెక్యులరిజాన్ని, మానవ హక్కులను రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మానవవాదులు పిలుపు నిచ్చారు. స్థానిక నాస్తిక కేంద్రంలో శనివారం అంతర్జాతీయ నాస్తిక మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తమిళనాడుకు చెందిన 'ది మోడరన్ రేషనలిస్ట్' జాయింట్ ఎడిటర్ కుమరేశన్ మాట్లాడుతూ, "నేడు సమాజంలో ఒకపక్క అభ్యుదయ ఉద్యమాలు, నాస్తిక మానవవాద ఉద్యమాలు సెక్యులరిజాన్ని ఎంతగానో బలపరుస్తూ ఉంటే మరోపక్క మతవాద, విభజన శక్తులు విజృంభిస్తున్నాయి... సెక్యులర్ రాజ్యాంగం అయినప్పటికీ ప్రభుత్వాలు కూడా ఈ మతవాద శక్తులకు లొంగిపోయి సెక్యులరిజానికి వక్రభాష్యాలు చెబుతున్నాయి... సెక్యులరిజం పరంగా ప్రభుత్వ విధానాల్లోగాని, చట్టాల్లోగాని ఏ విధంగానూ మత ప్రమేయం ఉండకూడదు... కాని ప్రభుత్వం పనిగట్టుకుని మతాన్ని ప్రోత్సహించడానికి రకరకాల విధానాలను అవలంభిస్తోంది... నేడు సెక్యులరిజం, మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోంది... అందరూ అప్రమత్తత కావాలని, సెక్యులరిజాన్ని, మానవ హక్కులను రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది" అని ఉద్ఘాటించారు. నాస్తికోద్యమ నిర్మాతలైన గోరా 120, సరస్వతీగోరా 110వ జయంతిని పురస్కరించుకుని నాస్తికకేంద్రం ఈ అంతర్జాతీయ సభలను నిర్వహిస్తోంది. సభలకు అమెరికా, ఇంగ్లాండ్, జర్మనీ, నేపాల్, తదితర దేశాల నుంచి చాలామంది నాస్తిక, హేతువాద, మానవవాద నాయకులు, భారతదేశంలో 28 రాష్ట్రాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. తొలుత నాస్తిక కేంద్రం చైర్మన్ డాక్టర్ సమరం స్వాగతం పలుకగా, వికాస్ గోరా ఈ మహా సభల ఉద్దేశాన్ని వివరించారు. నాస్తికకేంద్రానికి సన్నిహితులైన శాసనసభ్యులు గద్దె రామ్మోహన్, ఆంధ్రప్రదేశ్ మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ సమాజంలో రావలసిన మార్పులపై మాట్లాడారు. అమెరికాకు చెందిన 'ఫ్రీడమ్ ఫ్రమ్ రిలీజియన్ ఫౌండేషన్' కో ఫౌండర్ డాన్ బర్కర్, జర్మనీకి చెందిన అమరదేవ్, ఇంగ్లాండ్‌కు చెందిన ఉత్తమ్ నిరుల, బ్రిటీష్ హైకమిషన్‌కు చెందిన శక్తి ఎడమరుకు, ఫెడరేషన్ ఆఫ్ రేషనలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు సరేంద్ర నాయక్, మహారాష్ట్రకు చెందిన అంధశ్రద్ధ నిర్మూలన సమితి అధ్యక్షుడు అవినాష్పాటిల్ ప్రసంగించారు. అనంతరం మీడియా–సెక్యులరిజం, ఈ వైజ్ఞానిక యుగంలో రావలసిన మార్పులు, సెక్యులరిజం దృక్పథంతో సామాజిక సేవ, అంతర్జాతీయ మానవవాద ఉద్యమాలపై గోష్ఠులు జరిగాయి. డాక్టర్ నరేంద్రనాయక్ మహాత్మ్యాల గుట్టు రట్టును చేస్తూ సోదాహరణ ప్రసంగం చేశారు. గోరా–సరస్వతీగోరాపై నృత్యరూపకం ప్రదర్శన ఆకట్టుకుంది. ఆదివారం పలు అంశాలపై చర్చా గోష్ఠులు, తీర్మానాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

సీజేఐ చంద్రచూడ్‌కు హార్వర్డ్ 'గ్లోబల్ లీడర్‌షిప్ అవార్డు'

న్యూదిల్లీ: భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డీవై చంద్రచూడ్ సింగ్‌ను 'అవార్డ్ ఫర్ గ్లోబల్ లీడర్‌షిప్' వరించింది. దేశ–విదేశాల్లో అందించిన న్యాయ సేవలకు గుర్తింపుగా హార్వర్డ్ లా స్కూల్ సెంటర్ ఆయనను ఈ అవార్డుతో సన్మానించనుంది. ఈనెల 11న అవార్డు ప్రదానోత్సవం ఆన్‌లైన్‌లో జరుగుతుంది. ఈ సందర్భంగా సీజేఐ చంద్రచూడ్‌తో హార్వర్డ్ లా స్కూల్ ప్రొఫెసర్ డేవిడ్ విల్కిన్స్ మాట్లాడతారు. జస్టిస్ చంద్రచూడ్ ఎల్ఎల్ఎం పట్టా పొందారు. జురిడిషియల్ సైన్సెస్‌లో డాక్టరేట్‌ను అమెరికాలోని హార్వర్డ్ లా స్కూల్ నుంచి అందుకున్నారు. అయోధ్య భూ వివాదంతో సహా అనేక చరిత్రాత్మక తీర్పులు వెలువరిం చిన సర్వోన్నత న్యాయస్థానం ధర్మాసనాల్లో జస్టిస్ చంద్రచూడ్ కీలకంగా వ్యవహరించారు. గతేడాది నవంబరు 9న 50వ సీజేఐగా ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ఏజెంట్ సెట్‌లో సురేందర్ రెడ్డికి గాయం

హైదరాబాద్: అఖిల్ అక్కినేని నటిస్తున్న సినిమా 'ఏజెంట్' షూటింగ్ అవుతుండగా ఒక రాడ్ దర్శకుడు సురేందర్ రెడ్డి కాలు మీద పడి.. ఎడమ కాలుకి గాయం అయిందని చిత్ర యూనిట్ తెలిపింది. ఆయనని వెంటనే దగ్గరలోని ఆసుపత్రికి తీసుకు వెళ్లి చికిత్స చేయించినట్టుగా సమాచారం. 'ఏజెంట్' సినిమా మొదలు పెట్టి చాలా కాలం అయి, ఇప్పుడిప్పుడే చివరి దశలో ఉందని కూడా తెలిసింది. అయితే శనివారం షూటింగ్ సమయంలో సురేందర్ రెడ్డి కెమెరా ముందు నుంచి సూచన ఇవ్వడానికి లేచి ముందుకు వెళ్లటంతో అక్కడే వున్న ఒక రాడ్ సురేందర్ రెడ్డి కాలు మీద పడింది. అయితే కాలు మీద పడింది కాబట్టి సరిపోయింది కానీ, ఇంకా తల మీద పడితే ఇంకా పెద్ద ప్రమాదమే జరిగి ఉండేదని యూనిట్ సభ్యులు కొంత ఊపిరి పీల్చుకున్నారు. కాలుకు వెంటనే కట్టుకట్టి కొన్ని రోజులు విశ్రాంతి అవసరమని కూడా డాక్టర్లు చెప్పారు. అఖిల్, మిగతా యూనిట్ సభ్యులు వెంటనే సురేందర్ రెడ్డి దగ్గరకి చేరుకోవడం, ఆ వెంటనే ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. సినిమా ఆలస్యం అవకూడదని సురేందర్ రెడ్డి పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ చూసుకోవాలని నిర్ణయించుకున్నాడని, వీల్‌చైర్‌లో కూర్చుని సూచనలు ఇస్తున్నట్లు సమాచారం. డాక్టర్లు విశ్రాంతి అవసరం అన్నా, సురేందర్ రెడ్డి పని చేయడానికే మొగ్గు చూపుతున్నాడట. సాక్షి వైద్య ఇందులో కథానాయకురాలు కాగా, మలయాళం సూపర్ స్టార్ మమ్ముట్టి ఒక ప్రధాన పాత్ర పోషిస్తున్నారు.



ఓటీటీ చిత్రాలకూ సెన్సార్ ఉండాలి: గౌతమి

చెన్నై: ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ అనేది సినిమా థియేటర్లకు మరో రూపంగా భావిస్తే, ఆ వేదికపై విడుదలయ్యే చిత్రాలకు కూడా సెన్సార్ ఉండాలని సీనియర్ హీరోయిన్ గౌతమి అభిప్రాయ పడ్డారు. ఆమె తాజాగా నటించిన వెబ్‌సిరీస్ 'స్టోరీ ఆఫ్ థింగ్స్' శుక్రవారం నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. ఇందులో గౌతమితో పాటు భరత్, అదితి బాలన్, లింగా, వినోద్ కిషన్, రతికా సింగ్, రోజా తదితరులు నటించారు. జార్జ్ ఆంటోనీ తెరకెక్కించగా, సోనీ లివ్ కోసం నిర్మించారు. ఈ సందర్భంగా నటి గౌతమి మీడియాతో మాట్లాడుతూ.. "సినిమాకు మరో రూపం ఓటీటీ ప్లాట్‌ఫామ్స్. టీవీలను ఆదరించినట్టుగానే వీటిని కూడా స్వాగతించాలి. ఓటీటీల విస్తృతి అయిన తరువాత టాలెంట్ ఉన్న యువకులకు, నటీనటులకు అవకాశాలు పెరిగాయి. మంచి కథతో కూడిన చిన్న చిత్రాల విడుదలకు సరైన ప్లాట్‌ఫామ్‌గా మారింది. అయితే ఓటీటీలలో విడుదల చేసే సినిమాలు, వెబ్‌సిరీస్‌లకు సెన్సార్ నియంత్రణ లేకపోవడంతో.. అశ్లీల దృశ్యాలు, అసభ్య పదజాలంతో కూడిన డైలాగులను ఇష్టానుసారంగా ఉపయోగిస్తున్నారు. అందువల్ల ఓటీటీలలో విడుదలయ్యే సినిమాలు, వెబ్ సిరీస్‌లకు కూడా ఖచ్చితంగా సెన్సార్ నియంత్రణ ఉండాలన్నది నా వ్యక్తిగత అభిప్రాయం" అని పేర్కొన్నారు.

సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా మళ్లీ చేతన్‌శర్మ

ముంబై: క్రికెట్ జట్టు సెలెక్షన్ కమిటీ చైర్మన్‌ను భారత క్రికెట్ నియంత్రణ బోర్డు (బీసీసీఐ) ప్రకటించింది. సీనియర్ మెన్స్ జాతీయ జట్టు సెలెక్షన్ కమిటీ చైర్మన్‌గా మరోసారి చేతన్ శర్మను నియమిస్తున్నట్లు బీసీసీఐ వెల్లడించింది. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేసింది. ప్యానెల్‌లో సభ్యులుగా శివ్ సుందర్ దాస్, సుబ్రోతో బెనెర్జీ, సలీల్ అంకోలా, శ్రీధరన్ శరత్ నియమితులయ్యారు. చేతన్‌ను మరోసారి నియమిస్తారనే వార్తలు సోషల్ మీడియాలో వచ్చినప్పటికీ.. చీఫ్ సెలెక్టర్‌గా ఎంపిక చేస్తారని ఎవరూ ఊహించలేదు. 'పురుషుల సీనియర్ సెలెక్షన్ కమిటీని బీసీసీఐ నియమించింది. చేతన్ శర్మను కమిటీకి చైర్మన్‌గా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నాం' అని బీసీసీఐ తన అధికారిక ట్విటర్ వేదికగా వెల్లడించింది. గత టీ20 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ చేతిలో పది వికెట్ల తేడాతో భారత్ ఘోర పరాభవం చెందిన తర్వాత అప్పటి సెలెక్షన్ కమిటీపై బీసీసీఐ వేటు వేసిన సంగతి తెలిసిందే. ఆ వెంటనే కొత్త సెలెక్టర్ల కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. దాదాపు 50 మందికిపైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ) ముఖాముఖిలు నిర్వహించి సెలెక్టర్ల జాబితాను బీసీసీఐకి అప్పగించింది. బాధ్యతలు చేపట్టే చైర్మన్‌కు ఏడాదికి రూ. 1.25 కోట్లు, సెలెక్టర్లకు రూ. కోటిను పారితోషికంగా బీసీసీఐ ఇవ్వనుంది.

పంత్ మోకాలి శస్త్రచికిత్స విజయవంతం

ముంబై: గత డిసెంబర్ 30న దిల్లీ నుంచి డెహ్రాడూన్‌లోని రూర్కీకి వెళ్తుండగా టీమిండియా యువ బ్యాటర్ రిషభ్ పంత్ రోడ్డు ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. బీసీసీఐ వర్గాల కథనం ప్రకారం.. రిషభ్ పంత్ మోకాలి లిగ్మెంట్‌కు సంబంధించి శస్త్రచికిత్స విజయవంతమైంది. ఈ ఆపరేషన్‌ను కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో నిర్వహించినట్లు బీసీసీఐ పేర్కొంది. ప్రస్తుతం అతడు ముంబైలో ఈ ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నాడు. 'రిషభ్ పంత్ మోకాలి లిగ్మెంట్‌కు చేసిన శస్త్రచికిత్స విజయవంతమైంది. ప్రస్తుతం అతడు వైద్యుల అబ్జర్వేషన్‌లో ఉన్నాడు. బీసీసీఐ స్పోర్ట్స్ సైన్స్, మెడిసిన్ టీమ్ విభాగాధిపతి డాక్టర్ పార్దివాలా అధ్వర్యంలో పంత్ ఆరోగ్యపరిస్థితిని పరిశీలిస్తోంది' అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. దిల్లీ–డెహ్రాడూన్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదానికి గురైన వెంటనే పంత్‌ను డెహ్రాడూన్‌లోని మ్యాక్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడే నుదిటికి సంబంధించి స్వల్ప ప్లాస్టిక్ సర్జరీ నిర్వహించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ముంబైకి తరలించారు. కుడికాలు లిగ్మెంట్ శస్త్ర చికిత్స విజయవంతం కావడంతో ఇతర సమస్యలకు సంబంధించి అవసరమైతే లండన్‌కు పంపించేందుకూ బీసీసీఐ ఏర్పాట్లు చేసేందుకు సిద్ధంగా ఉంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.